

రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ 'సారథ్యం యాత్ర' ముగింపు సభ సూపర్ సక్సెస్

- హాజరైన జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు

మాట్లాడుతున్న జేపీ నడ్డా

గ్రామీణ రోడ్లకు మహర్దశ

'కోటవురట్ల'లో మూడు రహదారుల నిర్మాణానికి రూ.4.55 కోట్లు మంజూరు

- ఒక రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభం
- మరో రెండు రహదారుల పనులు త్వరలో మొదలు
- పలు గ్రామాల ప్రజలకు తీరనున్న రవాణా కష్టాలు



భీమబోయినపాలెం నుంచి తాండవ కాలువ గట్టు మీదుగా నూతనంగా నిర్మిస్తున్న రహదారి

కోటవురట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): **మండలంలో రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తున్నది. స్థానిక ఎమ్మెల్యే, హోం మంత్రి అయిన వంగలపూడి అనిత ప్రత్యేక శ్రద్ధ తీసుకుని శివారు గ్రామాల రహదారులకు మోక్షం కల్పిస్తున్నారు. మూడు రహదారులకు రూ.4.55 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో ఒక రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయి.**

మండలంలోని బోడపాలెం, చెర్లోపాలెం కొత్తూరు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే పాములవాక మీదుగా 28 కిలోమీటర్లు ప్రయాణించాలి. ఈ దూరాన్ని తగ్గించేందుకు తాండవ కాలవ గట్టు మీదుగా మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నుంచి రూ.1.75 కోట్లు మంజూరయ్యాయి. తొలుత మెటల్‌వేసి, క్రషర్ బుగ్గిచల్లి రోలింగ్ చేశారు. దీనిపై బీటీ (తారు) రోడ్డు వేస్తారు. రెండు నెలల క్రితం ప్రారంభించిన ఈ పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. వచ్చే నెలాఖరునాటికి పూర్తవుతాయని పంచాయతీరాజ్ శాఖ అధికారులు చెప్పారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే బోడపాలెం, చెర్లోపాలెం కొత్తూరు తదితర గ్రామాల ప్రజలు 19 కిలోమీటర్ల ప్రయాణించి మండల కేంద్రానికి చేరుకోవచ్చు. ప్రయాణ దూరం తొమ్మిది కిలోమీటర్లు తగ్గుతుంది.

యండపల్లి నుంచి నర్సీపట్నం మండలం వేములపూడికి వెళ్లే ఐదు కిలోమీటర్ల రహదారి గత పదేళ్ల నుంచి కనీస నిర్వహణ పనులకు నోచుకోలేదు. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి అధ్వానంగా ... మిగతా 6వ పేజీలో

నేడు డీఎస్సీ ఎంపిక జాబితా

ఉమ్మడి జిల్లాలో 1,134 మందికి ఉద్యోగాలు

- ఐదు ఉర్దూ ఎస్జీటీ పోస్టులకు అభ్యర్థుల కరువు
- 19న అమరావతిలో నియామకపత్రాల అందజేత
- 22వ తేదీ నుంచి జిల్లాలో రెసిడెన్షియల్ శిక్షణ



అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో మెరిట్ మేరకు ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థుల జాబితా సోమవారం విడుదల కానున్నది. ఎంపికైన అభ్యర్థుల వివరాలతో కూడిన జాబితాలను జిల్లాల వారీగా వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. దీంతోపాటు అభ్యర్థుల వివరాలతో ముద్రించిన కాపీలు జిల్లా కలెక్టర్, డీఈవో కార్యాలయాల్లో అందుబాటులో ఉంచనున్నారు. సబ్జెక్ట్, రిజర్వేషన్ల వారీగా మెరిట్, కటాఫ్ మార్కుల వివరాలతో అభ్యర్థుల వివరాలు వెల్లడికానున్నాయి.

ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 1,139 పోస్టులకుగాను 1,134 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. ఉర్దూ ఎస్జీటీ పోస్టులకు ... మిగతా 6వ పేజీలో

బీజేపీలో జోష్



సభలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



'సారథ్యం యాత్ర' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు జేపీ నడ్డా, మాధవ్, శ్రీనివాసవర్మ, సీఎం రమేశ్, సత్యకుమార్ యాదవ్, విష్ణుకుమార్‌రాజు, సోము వీర్రాజు, ఎస్.రామకృష్ణారెడ్డి, తదితరులు

- రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరిస్తున్నదన్న నడ్డా
- గ్రామీణ ప్రజలకు పార్టీని చేరువచేయాలని మాధవ్ పిలుపు
- గత వైసీపీ పాలనపై బీజేపీ నేతల తీవ్ర విమర్శలు
- పార్టీ శ్రేణులతో కిటకిటలాడిన రైల్వే మైదానం



సభకు హాజరైన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ విశాఖలోని రైల్వే మైదానంలో ఆదివారం నిర్వహించిన 'సారథ్యం యాత్ర' ముగింపు సభ విజయవంతమైంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ బాధ్యతలు చేపట్టిన తరువాత రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 50 రోజులపాటు యాత్ర నిర్వహించారు. పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు వివిధ వర్గాలతో మమేకమయ్యారు. ఈ యాత్ర ఆదివారం విశాఖలో ముగిసింది. ఈ నేపథ్యంలో రైల్వే మైదానంలో బహిరంగసభను నిర్వహించారు. సభకు రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా హాజరై శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. దేశం, రాష్ట్రం అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంత ... మిగతా 6వ పేజీలో

ఏటికొప్పాను సందర్శించండి

- బీజేపీ అధ్యక్షుడు నడ్డాను కోరిన హస్తకళాకారుడు
- ఏటికొప్పాక లక్కబొమ్మల చరిత్రను వివరించిన పెదపాటి శరత్

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు ఏటికొప్పాక లక్కబొమ్మల ప్రాశస్త్యాన్ని వివరిస్తున్న హస్త కళాకారుడు పెదపాటి శరత్



ఎలమంచిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని రైల్వే మైదానంలో ఆదివారం బీజేపీ నిర్వహించిన 'సారథ్యం యాత్ర' బహిరంగ సభకు హాజరైన పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు ఏటికొప్పాక లక్కబొమ్మల చరిత్రను వివరించినట్టు ప్రముఖ హస్తకళాకారుడ పెదపాటి శరత్ తెలిపారు. ఏటికొప్పాక గ్రామాన్ని సందర్శించి కళాఖండాలను పరిశీలించాలని నడ్డాను కోరినట్టు ఆయన చెప్పారు.

నాడు అలా.. నేడు ఇలా!



నాడు చెత్తా చెదారం పేరుకుపోయిన యల్లయ్యకాలువ (ఫైల్ ఫొటో)



ఇప్పుడు యల్లయ్య కాలువలో సాఫీగా పారుతున్న నీరు

యల్లయ్య కాలువకు పూర్వ వైభవం

- కాలువలో సాఫీగా నీటి ప్రవాహం
- సకాలంలో వరినాట్లు వేసుకున్న ఆయకట్టు రైతులు
- సాగునీటి వనరుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): **పట్టణంలోని యల్లయ్యకాలువకు పూర్వకళ సంతరించుకుంది. ఎప్పుడూ చెత్తా చెదారం, మురుగు నీటితో దుర్భరంగా ఉండే ఈ పంట కాలువ.. స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చొరవతో బాగుపడింది. ఆయకట్టుకు సాఫీగా నీరు అందుతున్నదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.**

అనకాపల్లి పట్టణానికి దక్షిణ, తూర్పు వైపున వున్న సుమారు రెండు వేల ఎకరాలకు నీరు అందించడానికి తుమ్మపాల వద్ద శారదా నదిపై యల్లయ్య గ్రోయిన్ నిర్మించారు. ఇక్కడ నుంచి పట్టణం మీదుగా పంట కాలువ వెళుతుంది. దీనికి ఆనుకొని మునిసిపల్ అధికారులు డ్రైనేజీ కాలువను నిర్మించడానికి ప్రతిపాదించగా, పంట కాలువలో నిర్వహణపనులు చేయడం సాధ్యం కాదని ఇరిగేషన్ అధికారులు అభ్యంతరం ... మిగతా 6వ పేజీలో

గంగవరంలో గ్రావెల్ తవ్వకాలు

అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు యంత్రాలతో దందా

- డంపర్లతో ఇతర ప్రాంతాలకు తరలింపు
- నెల రోజుల నుంచి యథేచ్ఛగా సాగుతున్న అక్రమ తవ్వకాలు
- పట్టించుకోని నియంత్రణ శాఖల అధికారులు



గంగవరం ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీని ఆనుకొని గ్రావెల్, మట్టి తవ్వకాలు జరపడంతో ఏర్పడిన చెరువు



నంగినారపాడు సమీపంలోని కొండ వాలు ప్రాంతంలో పది అడుగుల లోతున గ్రావెల్ తవ్వేసిన దృశ్యం

సబ్బవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరంలో (జీవీఎంసీ 88వ వార్డు పరిధి) ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీ లను అనుకొని యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత రీతిన నెల రోజుల నుంచి గ్రావెల్, మట్టిని తవ్వి తరలించుకుపోతున్నారు. రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖలు గతంలో గంగవరం, నంగినారపాడు గ్రామల పరిధిలో గ్రావెల్/మట్టి తవ్వకాలను అడ్డుకోగా, తరువాత ఏమైందో తెలియదుగానీ పట్టించుకోవడం మానేశారు. దీంతో నెల రోజుల నుంచి యంత్రాలతో గ్రావెల్, మట్టిని తవ్వి, భారీ డంపర్లతో చుట్టుపక్కల ప్రాంతా లకు రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల ... మిగతా 6వ పేజీలో

ఊరి మధ్యలో డంపింగ్ యార్డు!

రావికమతం, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): **మండల కేంద్రాన్ని ఏళ్ల తరబడి డంపింగ్ యార్డు సమస్య వేధిస్తున్నది. పంచాయతీలో సేకరించిన చెత్తాచెదారాన్ని వేయడానికి స్థలం ఎంపిక చేయడం అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధుల వల్ల కావడం లేదు. డంపింగ్ యార్డుకు ఎక్కడ స్థలాన్ని పరిశీలించినా.. అక్కడ స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీంతో గత కొన్ని నెలల నుంచి గ్రామం శివారులో, రహదారుల పక్కన ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తేఅక్కడ పడేస్తున్నారు. వర్షాలకు చెత్తాచెదారం కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నది. దోమలు, ఈగల బెడద పెరిగిపోయింది. వీటివల్ల మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, టైఫాయిడ్ బారిన పడతామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**



బీసీ హాస్టల్ పక్కన పడేసిన చెత్త

రావికమతంలో స్థల సమస్య

- తహశీల్దారు కార్యాలయం, బీసీ హాస్టల్ పక్కన చెత్తాచెదారం డంపింగ్
- వర్షాలకు కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన
- పగలు ఈగలు, రాత్రి దోమల బెడద
- వ్యాధులబారిన పడుతున్నట్టు స్థానికుల ఆందోళన



మీ సేవా కేంద్రం, తహశీల్దార్ కార్యాలయం మధ్యలో పడవేసిన చెత్తాచెదారం, సంచరిస్తున్న పందులు

రావికమతంలో రోజూ 10 నుంచి 15 టన్నుల వరకు చెత్తాచెదారం ఉత్పవిస్తుంది. ఇక్కడ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వున్నప్పటికీ గ్రామంలో సేకరించిన చెత్తను వేసేందుకు తగినంత స్థలం లేకపోవడంతో దానిని వినియోగించడంలేదు. దీంతో వీధుల్లో సేకరించిన చెత్తను గతంలో ఎ తహశీల్దారు కార్యాలయం పక్కన, హైస్కూల్ ప్రహరీ గోడను ఆనుకొని, గంజి వారి దేవాలయం పక్కన, కింతలి వెళ్లే రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో వేసేవారు. ఇవన్నీ నివాస ప్రాంతాలు కావడంతో చెత్తాచెదారం కుళ్లిపోయి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. పంచాయతీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో డంపింగ్ యార్డు కోసం స్థలం కేటాయించాలని మండల, జిల్లా అధికారులకు పలుమార్లు ప్రతిపాదనలు పంపారు. మండల కేంద్రాన్ని ఆనుకొని ఉన్న గుడివాడ పంచాయతీ శివారు మట్టవాని పాలెం, గొంప మెట, గర్నికం, రెవిన్యూలో పరిధిలో స్థలాలను పరిశీలించారు. అయితే ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చివరికి రావికమతం గ్రామలోని గుర్రయ్య కట్టు వద్ద ... మిగతా 6వ పేజీలో

ఏటికొప్పాక కళాఖండాలకు అవార్డులు



నూతన ఆవిష్కరణల విభాగంలో అవార్డు అందుకుంటున్న ఏటికొప్పాక కళాకారిణి రేవతి



వానపల్లి రేవతి రూపొందించిన కదిలే రోలు, రోకలి కళాఖండాలు

ఎలమంచిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏటికొప్పాక హస్తకళాఖండాలకు మరో సారి ప్రత్యేక గుర్తింపు లభించింది. విజయవాడలో జరిగిన లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్ డిజైన్ పోటీ-2025లో ఏటికొప్పాకకు చెందిన మహిళా కళాకారిణి వానపల్లి రేవతి రూపొందించిన కదిలే రోలు, రోకలి కళాఖండానికి అవార్డు లభించింది. ఏపీ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈ కార్యక్రమంలో చైర్మన్ పసుపులేటి హరి ప్రసాద్, ఎండీ శ్రీవిశ్వ, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా పాల్గొన్నారు. నూతన ఆవిష్కరణల విభాగంలో రేవతికి అవార్డుతోపాటు నగదు ప్రోత్సాహకాన్ని అం దించారు. ఇంకా ఏటికొప్పాక హస్తకళాకారులు వానపల్లి సాయి, పెదపూడి ఏసుదాసు, దిమిలి నాగబాబు రూపొందించిన కళాఖండాలు కూడా అవార్డులకు ఎంపికయ్యాయి.

మత్స్యకారులకు భారీగా చిక్కిన సూర చేపలు


మత్స్యకారుల వలకు చిక్కిన సూర చేపలు

అచ్యుతాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పూడిమడక శివారు జాలారిపాలెం మత్స్యకారులకు ఆదివారం సూర చేపలు అధికంగా పడ్డాయి. అల్పపీడనాల కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో గత నాలుగు రోజుల నుంచి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లలేదు. మరో రెండు రోజులు కూడా చేపల వేటకు వెళ్లకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయినా పూడిమడక శివారు జాలారిపాలెంకి చెందిన మత్స్యకారులు రెండు పడవల్లో చేపల వేటకు వెళ్లారు. వీరికి సూర చేపలు భారీగా లభ్యమయ్యాయి. ఆదివారం సాయంత్రం పూడిమడక తీరానికి చేరారు. దీంతో వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. కేజీ రూ.210 నుంచి రూ.230 వరకు కొనుగోలు చేశారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

రాంబిల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం సీపీఎం నాయకుడు సీతారాం ఏచూరి వర్ధంతిని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు మాట్లాడుతూ సీతారాం ఏచూరి జీవితమంతా కార్మికులు, రైతులు, కష్టజీవులుకోసం పనిచేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చందక రామకృష్ణ, వై.రాము, దోని, కాసియ్య, కార్మిక సంఘాల నాయకులు భూపతి అప్పారావు, డి.నరసింగరావు, వి.ఆదిరెడ్డి, శ్రీను, పారిపిల్లి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పండిట్ ఆచార్యులకు పురస్కారం


ఆచార్యులను సత్కరిస్తున్న నిర్వాహకులు

నక్కపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పెదబోదిగల్లం హైస్కూల్ తెలుగు పండిట్ ఎన్‌వీఎస్ ఆచార్యులకు ఆదివారం గుంటూరులో ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర శాఖ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందజేసింది. ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా కొంతమంది ఉత్తమ గురువులను సంస్థ ఎంపిక చేసింది. ఆదివారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో ఎన్‌వీఎస్ ఆచార్యులకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి, నాగార్జున విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ మంజుల చింతలపాటి పురస్కారాన్ని అందజేశారు. ఆయన్ని పలువురు అభినందించారు.

డాక్టర్ సాయితేజకి టీడీపీ నాయకుల సత్కారం


డాక్టర్ జి.సాయితేజను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో బంగారు పతకాన్ని సాధించిన వైద్య విద్యార్థి జి.సాయితేజను ఆదివారం టీడీపీ నేతలు పెదిరెడ్డి చిట్టిబాబు, తదితరులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు, దువ్వి శ్రీను, తాండవ వాలి ఉద్యానవన వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం సీఈఓ జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చోడమాంబికకు బంగారు శతమానాలు బహూకరణ

అచ్యుతాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య దేవత చోడపల్లి చోడమాంబిక అమ్మవారికి విశాఖపట్నంకి చెందిన దుంగ ఎల్లాజీ దంపతులు తులం బంగారు శతమానాలను ఆదివారం బహూకరించారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో దుర్గాదేవి ఉత్సవ రాట వేడుకలు

మునగపాక, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవ రాట వేడుకలు ఆదివారం జరిగాయి. మండలంలో నాగులాపల్లి సంతబయల ప్రాంతంలో ఉత్సవ రాటకు భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం కరపత్రం ఆవిష్కరణ చేశారు. అదేవిధంగా మునగపాక అంబేడ్కర్ కాలనీలో ఉత్సవ రాట వేడుక జరిగింది. ఆయా వేడుకల్లో బొడ్డేడ బలరాం, మళ్ల బాబూరావు, ఎం.సత్యనారాయణ, మళ్ల వెంకటఅప్పారావు, పిల్లి అప్పారావు పాల్గొన్నారు.

ముదిరిన రియల్ ఎస్టేట్ వెంచర్ రోడ్డు వివాదం

- రహదారి పనులకు రంగంలోకి దిగిన ఏపీఎస్‌ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు
- అడ్డుకున్న జూనియర్ నాగేశ్వరరావు
- ఇరువురి మధ్య తోపులాట
- విషయం తెలిసిన వెంటనే వెళ్లిన పోలీస్, రెవెన్యూ అధికారులు
- మూడు రోజులు పనులు నిలిపివేయాలని ఆదేశాలు
- అప్పటి వరకు పోలీస్ పికెట్ ఏర్పాటు


సంఘటనా స్థలంలో పోలీసులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దుప్పితూరు రియల్ ఎస్టేట్ వెంచర్ రోడ్డు వివాదం ముదిరి పాకాన పడింది. ఆదివారం స్వయంగా రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు దగ్గరుండి కాంక్రీటు రోడ్డు పనులను యంత్రాలతో ప్రారంభించగా.. మాజీ సర్పంచ్ ప్రగడ జూనియర్ నాగేశ్వరరావు అడ్డుకున్నారు. ఇరువురికి మధ్య తోపులాటకు దారితీయడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మూడు రోజుల వరకు పనులు ఆపాలని ఆదేశించారు. గొడవలు జరగకుండా సీఐ గణేష్ పోలీస్ పికెట్‌ని ఏర్పాటుచేశారు.


జూనియర్ నాగేశ్వరరావుపై మండిపడుతున్న ప్రగడ

మండలంలోని దుప్పితూరు సర్పంచ్ దేశంశెట్టి శంకరరావు (వైసీపీ) రోడ్డు పనులు ప్రారంభించగా జూనియర్ నాగేశ్వరరావు అడ్డుకున్నారు. దీంతో సర్పంచ్ శంకరరావు ఏపీఆర్‌డీసీ చైర్మన్‌కి రోడ్డు నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు పంచాయతీలో తీర్మానం చేసి ఇచ్చారు. ఆదివారం ఉదయం ప్రగడ నాగేశ్వరరావు యంత్రాల సహాయంతో రోడ్డు నిర్మాణం పనులను దగ్గరుండి ప్రారంభించారు. విషయం తెలుసుకున్న జూనియర్ నాగేశ్వరరావు తమ బలగంతో అక్కడికి వచ్చి రోడ్డు పనులను అడ్డుకున్నాడు. దీంతో బాబాయ్, అబ్బాయిల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి తోపులాట వరకు వచ్చింది. విషయం తెలుసుకున్న వెంటనే సీఐ నమ్మి గణేష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని వివాదాన్ని అదుపు చేశారు. ఈలోగా రెవెన్యూ సిబ్బంది అక్కడికి వచ్చి విషయం తెలుసుకున్నారు. ఉన్న రోడ్డునే వెడల్పు చేస్తున్నామని సీనియర్ నాగేశ్వరరావు వాదిస్తుండగా.. కేవలం రియల్టర్‌కి మేలు చేయడానికే ఈ రోడ్డు వేస్తున్నారని జూనియర్ నాగేశ్వరరావు వాదించాడు. కాగా పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలన జరిపి అనుమతి ఇచ్చేవరకు పనులను ఆపాలని రెవెన్యూ అధికారులు చెప్పడంతో ప్రస్తుతానికి పనులు ఆపేశారు. గొడవలు జరగకుండా ఉండడానికి పోలీస్ పికెట్‌ని ఏర్పాటుచేశామని సీఐ నమ్మి గణేష్ తెలిపారు.

సేఫ్ జోన్‌లో ఎంపీపీ పదవి?

- చక్రం తిప్పిన మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు
- దారిలోకి వచ్చిన డుమ్మా కొట్టిన ఎంపీటీసీ సభ్యులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం ఎంపీపీపై అవిశ్వాసం రోజుకో మలుపు తిరుగుతోంది. ఈనెల 13న 'ఆంధ్రజ్యోతి'లో 'అచ్యుతాపురం ఎంపీపీపై అవిశ్వాసం?' శీర్షికతో వచ్చిన కథనంతో వైసీపీ నాయకులు అప్రమత్తమయ్యారు. జారిపోయారనుకున్న వారిని మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు చక్రం తిప్పి తన దారికి తెచ్చుకున్నారనే ప్రచారం జరుగుతోంది. మండలంలో 21 మంది ఎంపీటీసీ సభ్యుల్లో 20 మంది వైసీపీ వారే. కూటమి ఎమ్మెల్యేగా సుందరపు విజయకుమార్ గెలిచిన తర్వాత ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు కూటమి పార్టీల్లోకి మారిపోయారు. ఎంపీపీతో కలిపి వైసీపీలో 15 మంది మిగిలారు. అయితే ఎంపీపీపై అవిశ్వాసం పెట్టి అచ్యుతాపురం ఎంపీటీసీ సభ్యురాలు ద్వారపురెడ్డి వెంకలక్ష్మిని ఎంపీపీగా చేయాలని ఆమె భర్త బాహూజీ పావులు కదిపారు. అంతా సిద్ధం చేసుకున్నారు. ఈనెల 24న అవిశ్వాసానికి నోటీస్ ఇవ్వాలని ముహూర్తం పెట్టుకున్నారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురావటంతో వైసీపీ నాయకులు అప్రమత్తమయ్యారు. శనివారం కొండకర్లలో గల కన్నబాబురాజు గెస్ట్‌హౌస్‌లో వైసీపీ ఎంపీటీసీ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఎంపీపీ కోన సంధ్యకాక మరో 14 సభ్యులు హాజరు కావలసి ఉండగా ఎనిమిది మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా ఆరుగురు గైర్హాజరయ్యారు. అయినా కన్నబాబు రాజు పట్టు వదలకుండా ఆ ఆరుగురిని కూడా ఆదివారం తమ వైపునకు తిప్పుకున్నారనే ప్రచారం సాగుతోంది. దీంతో ప్రస్తుత ఎంపీపీ పదవి సేఫ్ జోన్‌లో ఉందని వైసీపీ నాయకులు అంటున్నారు. ఈ వ్యవహారంలో ఎంపీటీసీలకు నజరానాలు అందాయని ప్రచారం జరుగుతోంది.

అచ్యుతాపురం ఫ్లైఓవర్ పనుల్లో నాణ్యత లోపం

- రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురంలోని ఫ్లైఓవర్ నిర్మాణ పనులు నాణ్యతా లోపంతో జరుగుతున్నారని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులు లేకుండానే కాంట్రాక్టర్ తనకు ఇష్టం వచ్చిన రీతిలో పనులు చేస్తున్నారన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందన్నారు. నిబంధనలు పాటించకుండా ఎక్కడ పడితే అక్కడ స్టాపర్‌లు పెట్టి ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం కల్పిస్తున్నారన్నారు. దీనివల్ల సెజ్ కర్మాగారాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాంట్రాక్టర్ నిబంధనలు పాటించకపోవడంతో అచ్యుతాపురంలో గంటల కొలది ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారుల పర్యవేక్షణలో పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.


అచ్యుతాపురంలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

బల్క్‌డ్రగ్ వద్దంటూ ఆందోళన

నక్కపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట గ్రామంలో ఆదివారం బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ మత్స్యకారులు ఆందోళన చేపట్టారు. వారికి సీపీఎం నేత ఎం.అప్పలరాజు, తదితరులు సంఘీభావం ప్రకటించారు. బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా శాంతియుతంగా రిలే నిరసన దీక్షలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తుండగా.. పోలీసులు అడ్డుకున్నారు. టెంట్ వేయడానికి మత్స్యకారులు ప్రయత్నించినప్పటికీ పోలీసులు అంగీకరించలేదు. ఈ ఆందోళనలో మత్స్యకార నాయకులు నగేశ్, సత్తియ్య, ఎం.మహేశ్‌బాబు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్కుకు సంబంధించి ప్రభుత్వాధికారుల ఉత్తర్వులకు విరుద్ధంగా ఆదివారం ధర్నా,నిరసన చేపట్టిన పలువురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ కె.కుమారస్వామి రాత్రి చెప్పారు.

యువకుడిని రక్షించిన మెరైన్ పోలీసులు


తీరంలో రక్షించిన కర్రి సాయితో మెరైన్ పోలీసులు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని రేవుపోలవరం సముద్ర తీరంలో కొట్టుకుపోతున్న యువకుడిని ఆదివారం మెరైన్ పోలీసులు రక్షించారు. ఇందుకు సంబంధించి మెరైన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. చోడవరం మండలం గౌరీపట్నం గ్రామానికి చెందిన కర్రి శివ మండలంలోని పెదగుమ్ములూరులోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. అక్కడ నుంచి మరో ఇద్దరితో కలిసి రేవుపోలవరం సముద్రతీరానికి వెళ్లాడు. ముగ్గురు సముద్రతీరంలో స్నానాలు చేస్తుండగా శివ సముద్రంలో కొట్టుకుపోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న పెంటకోట మెరైన్ ఎస్ఐలు దొర, కృష్ణ, కానిస్టేబుల్ చిన్నబాబు, సిబ్బంది శివ, శ్రీను, అప్పలరాజులు ఆ యువకుడి రక్షించి ఒడ్డుకు చేర్చారు. యువకుడిని కాపాడిన మెరైన్ పోలీసులను పలువురు పర్యాటకులు అభినందించారు.

రాంబిల్లి సొసైటీని అభివృద్ధి బాటలో నడిపించాలి

- మాజీ ఎంపీ పప్పల చలపతిరావు


రాంబిల్లి సొసైటీ చైర్‌పర్సన్ చిట్టిబాబును సత్కరిస్తున్న మాజీ ఎంపీ పప్పల చలపతిరావు

రాంబిల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి పీఏసీఎస్‌ను అభివృద్ధి బాటలో నడిపించాలని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు నూతన కార్యవర్గానికి సూచించారు. సొసైటీ చైర్‌పర్సన్ ఎరిపిల్లి చిట్టిబాబు ఆదివారం మాజీ ఎంపీ పప్పల చలపతిరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిట్టిబాబును మాజీఎంపీ సత్కరించి, ఆశీర్వదించారు. అనంతరం చలపతిరావు మాట్లాడుతూ సొసైటీ రైతులకు సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎరిపిల్లి అజయ్, కొరెడ్ల ఈశ్వరరావు, చెల్లూరి ఆనంద్, సేనాపతి నాగేశ్వరరావు, గరికిన గోవింద్, సూరాడ రాముడు, పాలెపు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

'దీక్షల వెనుక పరమార్థం తెలుసుకోవాలి'

నక్కపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సనాతన హిందూ ధర్మంలో భక్తులు చేపట్టే పూజలు, దీక్షల వెనుక ఎన్నో పరమార్థాలు, ఆరోగ్య సూత్రాలు దాగి వున్నాయని వీహెచ్‌పీ జిల్లా మాజీ అధ్యక్షులు గొట్టుముక్కల శ్రీహరి రాజు అన్నారు. మండలంలోని రేబాక గూడుపమ్మ ఆలయంలో ఆదివారం భవానీ దీక్షాపరులనుద్దేశించి ఆయన మాట్లాడారు. సృష్టికి మూలమైన జగన్మాత అనేక రూపాల్లో, అనేక చోట్ల దర్శనమిస్తుంటారని, చిత్తశుద్ధితో పూజలు చేస్తే ఎంతో ఫలితం వుంటుందన్నారు. ఆదివారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, చందనాడ ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, వైసీపీ నాయకులు మనబాల తాతారావు, తళ్ల భార్గవ్, నెల్లిపూడి సర్పంచ్ సురేశ్ రాజు రేబాక గూడుపమ్మతల్లిని దర్శించుకున్నారు.

అవిశ్వాస భయంతోనే ఎంపీపీ వైసీపీలో చేరారు

- నాగులాపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ భాస్కరరావు

మునగపాక, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అవిశ్వాసం పెడతారనే భయంతోనే మునగపాక ఎంపీపీ మళ్ల జయలక్ష్మి తిరిగి వైసీపీలో చేరారని నాగులాపల్లి సహకార సంఘం చైర్ పర్సన్ యల్లపు వెంకట భాస్కరరావు ఆరోపించారు. ఆదివారం స్థానిక జనతా గ్యారేజ్ వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్వలాభం కోసం జనసేనలో చేరిన ఎంపీపీ అది కుదరకపోవడంతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారన్నారు. జనసేన పార్టీ నాయకుడు ఏవీ.సత్యనారాయణ మాట్లాడుతూ ఎంపీపీగా జయలక్ష్మి మండలానికి చేసింది ఏమీలేదన్నారు. జనసేనలో గుర్తింపు ఇవ్వలేదని చెప్పడం అవాస్తవం అన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు అల్లవరపు రమణబాబు, వేగి కృష్ణ, సంతోష్‌కుమార్, కాండ్రేగుల పరదేశిరావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

అచ్యుతాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 142వ ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 750 మంది రోగులు హాజరు కాగా 647 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 450 మందికి ఉచితంగా కంటి అద్దాలు ఇవ్వగా.. 140 మందికి మందులు ఇచ్చారు 57 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. విశాఖ శంకర్ ఫౌండేషన్‌లో వీరికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామని బ్రాండిక్స్ ప్రతినిధులు తెలిపారు.

'రోడ్డు నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు వద్దు'

అచ్యుతాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు వద్దని 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం హరిపాలెంలో జరిగిన రోడ్డు నిర్వాసితుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో అధికారులు నిర్వాసితులతో సమావేశాలు ఏర్పాటుచేయగా తమకు టీడీఆర్ బాండ్లు వద్దని అభిప్రాయాలను తెలియజేశారన్నారు. అయినా టీడీఆర్ బాండ్లు ఇస్తామనడం సబబు కాదన్నారు. అనంతరం హరిపాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె. రామసదాశివరావు, రొంగలి రాము, బుద్ద రంగారావు, కర్రి అప్పారావు, ఎస్ బ్రహ్మాజీ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఊరి మధ్యలో డంపింగ్ యార్డు!

... 5వ పేజీ తరువాయి

సర్వే నంబరు 65/11లో 70 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు 2023 ఆగస్టులో కేటాయించారు. అప్పటి నుంచి గ్రామంలో సేకరించిన చెత్తను ఇక్కడ పడేసేవారు. ఆరు నెలలు తిరక్కుండానే ఓ వ్యక్తి ఈ స్థలం తనదంటూ కోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చారు. దీంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. యథావిధిగా మీసేవ కేంద్రం- తహశీల్దారు కార్యాయానికి మధ్యలో వున్న ఖాళీ స్థలంలో, బీసీ విద్యార్థుల హాస్టల్‌ను ఆనుకొని చెత్తను పడేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో చెత్తాచెదారం కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నది. దీనికితోడు పందుల ఆవాసంగా మారిపోయింది. పగలు ఈగలు, రాత్రి దోమల బెడద పెరిగిపోయింది. చెత్త సమస్యపై పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాలతో ఇక్కడ చెత్తను లారీలతో విశాఖపట్నం కాపులుప్పాడలోని జిందాల్ విద్యుత్ కేంద్రానికి తరలింపు చర్యలు చేపట్టామని. అయితే ఒక్కో ట్రిప్పునకు (సుమారు పది టన్నులు) రూ.12 వేలు కిరాయి చెల్లించాల్సి వస్తున్నదని చెప్పారు. రోజూ ఒక లారీ చెత్త వస్తుందని, అంత ఖర్చును భరించే స్థోమత పంచాయతీకి లేకపోవడంతో కాపులుప్పాడకు చెత్తను తరలించడం లేదని చెప్పారు. డంపింగ్ యార్డుకు రెవెన్యూ శాఖ కేటాయించిన స్థలంపై న్యాయ వివాదం కొలిక్కి వచ్చే వరకు చెత్త సమస్యకు మోక్షం లేదని నిస్సహాయతను వ్యక్తం చేశారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

తయారైంది. దీనిని అభివృద్ధి చేయడానికి నాబార్డు నిధులు రూ.1.45 కోట్లు మంజూరయ్యాయి. అదే విధంగా ఎల్‌వీకే రోడ్డు నుంచి జి.సన్యాసిరాజుపాలెం మీదుగా నీలిగుంట వరకు రహదారి మొత్తం పాడైపోయింది. సుమారు ఐదు కిలోమీటర్లు వున్న ఈ రోడ్డు అభివృద్ధికి నాబార్డు నిధులు రూ.1.35 కోట్లు మంజూరయ్యాయి. ఈ రెండు పనులకు టెండర్ల ప్రక్రియ ముగిసి, అగ్రిమెంట్ కూడా పూర్తయ్యిందని, కొద్ది రోజుల్లోనే పనులు ప్రారంభం అవుతాయని పీఆర్ (ప్రాజెక్ట్) డీఈఈ రాజ్‌కుమార్ తెలిపారు.

బీజేపీలో జోష్

... 5వ పేజీ తరువాయి

అభివృద్ధి కోసం తెచ్చిన పరిశ్రమలు, ప్రాజెక్టుల గురించి వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నదని, ఇందుకు అవసరమైన నిధులను ఇస్తున్నదని చెప్పారు. భవిష్యత్తులో మరింత చేయూత అందిస్తామని స్పష్టం చేశారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోయేందుకు మోదీ ఇతోధికంగా సాయపడుతున్నారన్నారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం

డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వివరించారు. స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకునేందుకు గతంలో వాజపేయి, ఇప్పుడు మోదీ సర్కారు అందించిన సహాయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. సుమారు రూ.11,500 కోట్ల గ్రాంట్‌ను ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంటుకు అందించి ఆదుకునేందుకు యత్నిస్తున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలంతా కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత బీజేపీ తీసుకుందన్నారు. అగ్ర నాయకుల ప్రసంగాలకు పార్టీ శ్రేణుల నుంచి మంచి స్పందన వచ్చింది. అంతకుముందు పార్టీ నాయకులకు శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఓపెన్ టాప్ వాహనంపై నడ్డా, మాధవ్ తదితర నేతలు ర్యాలీగా వేదిక వద్దకు చేరుకున్నారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను సందర్శించారు. అరకు కాఫీ, ఏటికొప్పాక బొమ్మలు, కొబ్బరిపీచుతో తయారుచేసిన వస్తువులు, పొందూరు ఖాదీ ఉత్పత్తులను పరిశీలించారు. నడ్డాతో పాటు ఇతర ప్రముఖులకు జీసీసీ అధికారులు బహుమతులను అందించారు. అనంతరం వేదికపైకి చేరుకున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, జాతీయ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్‌కు రాష్ట్ర నేతలు స్వాగతం పలికారు. పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు ఆధ్వర్యంలో జేపీ నడ్డా, మాధవ్‌లను గజమాలతో సత్కరించారు. అంతకుముందు సభా ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, విష్ణుకుమార్ రాజు, కామినేని శ్రీనివాస్, నడుకుదిటి ఈశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, నాయకులు పాల్గొన్నారు.

భారీగా హాజరైన శ్రేణులు..

సభకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే సభా ప్రాంగణానికి రావడం మొదలుపెట్టారు. 11 గంటలకు ముఖ్య నాయకులు వేదికపైకి వచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభ సాగింది. వర్షం వచ్చినా ఆటంకం లేకుండా భారీ రెయిన్ ప్రూఫ్ టెంట్లు వేశారు.

గంగవరంలో గ్రావెల్ తవ్వకాలు

... 5వ పేజీ తరువాయి

కంట పడకుండా అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు తెల్లవారు జాము వరకు తవ్వకాలు జరుపుతున్నారు. ఈ సమయంలో ఇటుగా ఎవరైనా వస్తుంటే సమాచారం ఇవ్వడానికిచుట్టుపక్కల మార్గాల్లో 10 నుంచి 15 మందిని కాపలా పెట్టారు. ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలను ఆనుకొని తవ్వకు పోతున్న మట్టి, గ్రావెల్‌ను గంగవరం, వెదుళ్లనరవ, గాజువాక మండలం దువ్వాడ, సంధ్యానగర్ కాలనీ, చుట్టుపక్కల ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వివిధ పనుల నిమిత్తం గ్రావెల్, మట్టి అవసరమైన వారికి డంపింగ్ యార్డుల నుంచి పట్టపగలు దర్జాగా తరలిస్తున్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలను ఆనుకొని గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారికి రెవెన్యూ, మైనింగ్ శాఖలకు చెందిన కిందిస్థాయి సిబ్బంది సహకరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ తవ్వకాల గురించి అధికారులకు సమాచారం ఇస్తే.. వారు ఈ విషయాన్ని కిందిస్థాయి సిబ్బందికి చెప్పి, సంఘటన స్థలానికి వెళ్లాలని ఆదేశిస్తున్నారని, అయితే గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోకుండా, సమాచారం ఇచ్చిన వారి వివరాలను అక్రమార్కులకు చేరవేస్తున్నారని, దీంతో వారు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆవేన వ్యక్తం చేస్తున్నారు. అందుకే కొంతకాలం నుంచి ఫిర్యాదులు చేయడం, సమాచారం ఇవ్వడం ఆపేశామని చెబుతున్నారు. గంగవరం ఆనుకొని ఉన్న నంగినారపాడు రెవెన్యూ పరిధిలో కూడా ఎర్రమట్టిని తవ్వి తరలించుకుపోతున్నారని చెబుతున్నారు.

నాడు అలా..నేడు ఇలా!

... 5వ పేజీ తరువాయి

చెప్పారు. అయితే పంట కాలువలో చెత్తాచెదారం తొలగించే పనిని తాము చేపడతామని మునిసిపల్ అధికారులు చెప్పడంతో ఇరిగేషన్ అధికారులు అంగీకరించారు. అయితే అనకాపల్లి మునిసిపాలిటీ జీవీఎంసీలో విలీనం అయిన తరువాత యల్లయ్య కాలువ నిర్వహణను సరిగా పట్టించుకోలేదు. కాలువకు ఇరుపక్కలా నివాసాలు పెరిగిపోవడంతో చెత్తాచెదారం సమస్య అధికమైంది. కాలువలో నీరు ప్రవహించకపోవడంతో పొలాలకు సకాలంలో నీరు అందేది కాదు. వర్షాధారంగా రైతులు పంటలు పండించుకోవాల్సి వచ్చేది. వైసీపీ అధికారంలో వున్న ఐదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా కాలువలో పూర్తిస్థాయిలో పూడికలు తీయించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత యల్లయ్య కాలువ సమస్యను ఆయకట్టు రైతులు, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. అయితే అప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో గత ఏడాది కాలువలో పనులు చేపట్టడానికి వీలు కాలేదు. ఈ ఏడాది వేసవిలో నియోజకవర్గంలోని పంట కాలువల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. సుమారు రెండు కోట్ల రూపాయలతో సాగునీటి సంఘాల పర్యవేక్షణలో పనులు చేయించారు. దీనిలో భాగంగా జీవీఎంసీ ద్వారా రూ.50 లక్షలతో యల్లయ్య కాలువలో పూడికలు తీయించడంతోపాటు గ్రోయిన్‌కు సమీపంలో కాలువను అభివృద్ధి పరిచారు. దీంతో ఆయకట్టుకు సాఫీగా నీరు చేరుతున్నదని, సకాలంలో వరినాట్లు వేసుకున్నామని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు డీఎస్సీ ఎంపిక జాబితా

... 5వ పేజీ తరువాయి

అర్హులైన అభ్యర్థులు లభించలేదు. దీంతో ఐదు పోస్టులను పెండింగ్‌లో ఉంచారు. మిగిలిన పోస్టుల్లో కేటగిరీల వారీగా జడ్పీ, మునిసిపల్, ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో ఎస్జీటీలు 239, స్కూల్ అసిస్టెంట్, తత్సమాన వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు 495, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఎస్జీటీలు 335, స్కూల్ అసిస్టెంట్ 65 పోస్టులకు మెరిట్ జాబితా మేరకు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేశారు. మొత్తం 1,134 మంది అభ్యర్థుల వివరాలతో కూడిన జాబితాపై అభ్యంతరాలు తెలుసుకునేందుకు వీలుగా రెండు రోజుల కిందటే జాబితాను జిల్లాకు పంపారు. జాబితాను పరిశీలించిన విద్యా శాఖ తిరిగి పాఠశాల విద్యాశాఖకు పంపింది.

19న నియామక పత్రాలు

డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 19వ తేదీన రాజధాని అమరావతిలో నియామకపత్రాలు అందజేస్తారు. 22వ తేదీ నుంచి వారందరికీ జిల్లాలో రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం 80 మంది టీచర్లను రిసోర్స్ పర్సన్లుగా ఎంపికచేశారు. ఎస్జీటీలు, సబ్జెక్టు వారీగా స్కూల్ అసిస్టెంట్లకు వేర్వేరుగా శిక్షణ అందిస్తారు. అయితే మొత్తం 1,134 మందికి ఒకేచోట శిక్షణ ఇచ్చేందుకు అనువుగా ఉండే వేదికను ఎంపిక చేసేందుకు విద్యా శాఖ కసరత్తు చేస్తున్నది. దీంతో పాటు సబ్జెక్టు టీచర్లకు మూడు జిల్లాల్లో వేర్వేరుగా శిక్షణ ఇచ్చే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తున్నామని విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.



కోర్టు సమీపంలో ముహూర్తపు రాటోత్సవంలో మళ్ల సురేంద్ర తదితరులు

దుర్గాదేవి నవరాత్రి వేడుకలకు రాటోత్సవం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెయిన్ రోడ్డులో గల కోర్టు సమీపాన హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం ముహూర్తపు రాటను వేశారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర హాజరై పూజలు చేశారు. దసరా ఉత్సవాలు ఎవరికీ ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం.బాల, హరీష్, భాస్కర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, గవరపాలెం నిదానం దొడ్డిలోని కామాక్షిదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన వివరాల పుస్తకాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఆదివారం ఆవిష్కరించారు. రోజుకో అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. సంఘం అధ్యక్షులు పొన్నాడ వెంకట సత్య నరసింగ ఆచారి, ప్రధాన కార్యదర్శి యండపల్లి మోహన బ్రహ్మాజీ, కోశాధికారి కిలాడ శ్రీనివాసరావు, పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు వెదురుపాటి సుందరయ్య, పట్టణ కార్పెంటర్ల సంఘం అధ్యక్షుడు కోరుకొండ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ బొంకుల దిబ్బ యూత్ ఆధ్వర్యంలో...



బొంకుల దిబ్బవీధిలో జరిగిన వేడుకలో ఎంపీపీ, తదితరులు

పరవాడ : మండల కేంద్రం పరవాడ బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఆదివారం ముహూర్తపు రాట వేశారు. తొలుత వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారికి ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులు పూజలు నిర్వహించారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు రెండో తేదీ దసరా వరకు ఉత్సవాలను వైభవంగా జరుపుతామని సభ్యులు తెలిపారు. సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమా, స్థానిక నాయకులు చుక్క రామునాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావు, పైలా అప్పారావు, పైలా పోతునాయుడు, బొద్దపు అయ్యబాబు, చల్లా కనకారావు, బొం కుల దిబ్బయూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు ఉచిత విద్యుత్‌పై కృతజ్ఞతలు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధి శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా వేసిన స్వామివారి మండపాలకు చలానాలు, విద్యుత్ బిల్లులు వంటివి లేకుండా సహకరించిన కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర గణేశ్ ఉత్సవ సమితి ధన్యవాదాలు తెలిపింది. ఆదివారం ఇక్కడ జరిగిన సమితి కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు విల్లూరి శ్రీనివాసరావు, నియోజకవర్గ కన్వీనర్ దాడి వాసు మాట్లాడారు. ధార్మిక చింతన, సామాజిక సద్భావన, పర్యావరణ పరిరక్షణ కోసమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గణేశ్ ఉత్సవ సమితి ఏర్పడిందన్నారు. గణేశ్ ఉత్సవాల నిర్వహకులకు అన్నివిధాలా సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలియజేశారు. బంకుపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ వి.హరి, బొడ్డేడ అప్పారావు, ఎ.ప్రవీణ్‌కుమార్, కోరిబిల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగిరెడ్ల కాలనీలో ఎమ్మెల్యే పర్యటన

లంకెలపాలెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీ ఎంసీ 85వ వార్డు పరిధి గంగిరెడ్ల కాలనీలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోమవారం పర్యటించనున్నారని కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మీప్రసాద్ తెలిపారు. కాలనీలో రూ.125 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు, అలాగే, ప్రారంభోత్సవాలను చేపట్టనున్నారని వివరించారు. కూటమి శ్రేణులు విజయంతం చేయాల్సిందిగా ఆమె కోరారు.

పచ్చదనం పెంపుతో పర్యావరణ పరిరక్షణ



బీఆర్‌టీ కాలనీలో మొక్కలు నాటుతున్న గ్రీన్‌క్లబ్ ప్రతినిధులు

కొత్తూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ పిలుపునిచ్చారు. గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్‌టీ కాలనీలోని పలు ప్రాంతాల్లో వేప, బాదం, పనస, రావి, మామిడి తదితర మొక్కలను నాటారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ పచ్చదనం పెంపు అందరి బాధ్యతగా పేర్కొన్నారు. సర్పంచ్ యల్లపు రమేష్, గ్రామ పెద్దలు యల్లపు వెంకట్రావు, దొడ్డి సూరిబాబు, నైనంశెట్టి సత్తిబాబు, బి.శేషసాయి, వంకాయల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చెప్పడమే తప్ప.. పాటించరా..సారూ..

- చెత్తా చెదారంతో అధ్వానంగా జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణ
- చినుకుపడితే పింగ్‌యార్డుతో ప్రత్యక్ష నరకం
- దుర్వాసనను భరించలేకపోతున్న సిబ్బంది, పరిసరాల వారు
- దీర్ఘకాలంగా సమస్య ఉన్నా పట్టని ఉన్నతాధికారులు



జీవీఎంసీ జోనల్ కార్యాలయం





జోనల్ కార్యాలయ ఆర్‌వో ఆఫీస్ పక్కన చెత్తా చెదారం (ఇన్‌సెట్) రెండో గేటు వద్ద ...

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణం నడిబొడ్డున ఉన్న జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణ దుర్భరంగా మారింది. ఇక్కడే డంపింగ్‌యార్డు ఉండడంతో చినుకుపడితే ఆ ప్రాంతమంతా మురికి కూపంలా మారుతోంది. కార్యాలయ ప్రధాన మార్గంలోని కొంత భాగం మినహా మిగతా ప్రాంగణమంతా ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఫలితంగా కార్యాలయానికి వచ్చే ప్రజలతో పాటు అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవీఎంసీ జోనల్ అధికారులు మాత్రం ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టలేకపోతున్నారు. పరిసరాల పరిశుభ్రత గురించి పదేపదే చెప్పేవారు తమ కార్యాలయ పరిధినే పట్టించుకోకుంటే ఎలా అని పలువురు విమర్శిస్తున్నారు. ఇదిలావుంటే, ఇక్కడ పరిసరాల్లో నివసించే వారు, కళాశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులు దుర్వాసనను భరించలేకపోతున్నారు. కార్యాలయానికి ఆనుకొని ఉన్న నివాసస్థులైతే ఇంటి తలుపులు తీయడానికి కూడా ఇష్టపడడం లేదు. డంపింగ్ యార్డు వల్ల ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నామని వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం కార్యాలయం ఆవరణ అయినా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని వివిధ పనులపై వచ్చే ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యను శానిటేషన్ సూపర్‌వైజర్ రవికుమార్ వద్ద ప్రస్తావించగా, శని, ఆదివారాలు కావడంతో కార్మికులు సెలవు తీసుకున్నారన్నారు. దీనివల్ల పరిశుభ్రతకు అవకాశం లేకుండా పోయిందని, ఇకపై పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తామని వివరించారు.

నూకాంబిక ఆలయంలో భక్తుల సందడి



బాలాలయంలో అమ్మకు పూజలు



ఆలయం ఆవరణలో దర్శనానికి క్యూలో ఉన్న జనం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున ఆరు గంటలకు అర్చకులు బాలాలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చారు. కుటుంబాలతో విచ్చేసినవారు ఆలయం ఆవరణతో పాటు చుట్టుపక్కల తోటల్లో వంటలు వండుకుని అమ్మవారిని నైవేద్యంగా సమర్పించి ఆరగించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది గంగాధర్

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలి

- ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ యూనిట్ డిమాండ్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, న్యాయస్థానాల్లో ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ యూనిట్ డిమాండ్ చేసింది. ఇక్కడి గాంధీనగరంలో ఆదివారం జరిగిన సమావేశంలో ప్రముఖ న్యాయవాది ఐఆర్ గంగాధర్ మాట్లాడుతూ దేశంలో, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టులు ఒక్కోసారి న్యాయవాదిని కమిషనర్‌గా నియమించి తమ ప్రతినిధిగా పంపిస్తాయని, అటువంటి కమిషనర్లు విధి నిర్వహణలో ఉండగా వారిపై కూడా దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బార్ కౌన్సిల్‌లో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని తీర్మానం చేసినా ప్రభుత్వాలు పట్టించుకోలేదని వాపోయారు. సంస్థ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పీఎస్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ న్యాయ స్థానాలకు అనేక మంది ప్రతిరోజూ వస్తూంటారని, వీరిలో ముఖ్యంగా మహిళలు, పిల్లలు, దివ్యాంగులకు మౌలిక వసతులు అందుబాటులో ఉండాలన్నారు. మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం తప్పనిసరని పేర్కొన్నారు. అటువంటి సదుపాయం లేకపోతే అది మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొన్నారు. అనకాపల్లిలో ఉన్న కోర్టులన్నీ అద్దె భవనంలో నడుస్తున్నాయన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి కోర్టుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో న్యాయవాదులు ఇల్లా అవినాష్, ఓడిబోయిన రాంబాబు, చిట్టా జయశ్రీ, జి.బాల ప్రభ, ఒడిసెల కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల యూనియన్ ఉమ్మడి విశాఖ జిల్లా సదస్సులో వక్తలు డిమాండ్ చేశారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సదస్సులో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.బసవరాజు మాట్లాడారు. గర్భిణులు, బాలింతలను గమ్యస్థానాలకు చేర్చి సేవ చేస్తున్న 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి బీమా సౌకర్యం కల్పించాలనే డిమాండ్లపై భవిష్యత్తులో పోరాటానికి అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం, అరబిందో యాజమాన్యం దృష్టికి ఈ అంశాలను పలుమార్లు తీసుకు వెళ్లినా స్పందించలేదని వాపోయారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్న ప్రభుత్వ విధానం మారే వరకు పోరాటం చేయాలన్నారు. అత్యంత తక్కువ వేతనాలతో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.దేవీప్రసాద్, విశాఖ జిల్లా అధ్యక్షుడు వైసతీష్, అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడు వి.వాసు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకే ఎల్లుప్పిలో ఆక్రమణల తొలగింపు

- తహశీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగానే మండలంలోని ఎల్లుప్పి గ్రామం సర్వే నెంబరు 16లో గెడ్డవాగు, ప్రభుత్వ భూమిలో పశువుల పాకలను తొలగించామని తహశీల్దార్ బి.చిన్నికృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో ప్రభుత్వ భూములు, గెడ్డవాగులు, చెరువులు ఆక్రమణలకు గురికాకుండా కాపాడే బాధ్యత గ్రామ రెవెన్యూ అధికారులకు అప్పగించినట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే గ్రామ రెవెన్యూ అధికారి ఇచ్చిన నివేది ఆధారంగానే ఎల్లుప్పిలో గెడ్డవాగులోని పశువుల పాకలు తొలగించడం జరిగిందని వివరించారు. సుప్రీం కోర్టు సూచనలు పాటిస్తూ ఈ నెల పదో తేదీన ఆర్ఐ, వీఆర్వో, వీఆర్ఏ వెళ్లి గెడ్డవాగులోని ఆక్రమణలు తొలగించారని తెలియజేశారు. చెరువులు, వాగులు, ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారు ఎంతటి వారైనా క్రిమినల్ చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వాడచీపురుపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ప్రసాద్

పరవాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్‌కార్డులను ఆదివారం వాడచీపురుపల్లిలో జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ పలువురు లబ్ధిదారులకు అందజేశారు. ఏ డిపోలోనైనా స్మార్ట్ కార్డు స్కాన్ చేసి రేషన్ సరుకులు పొందే అవకాశముందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివలంక లక్ష్మి, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, కూటమి నాయకులు బుగిడి రామగోవిందరావు, వెలుగుల అనీల్‌కుమార్, కూండ్రపు శ్రీను, వెన్నెల నరసింహారావు, బండారు అప్పలనాయుడు, దలాయి నాగేష్, పోలవరపు రవి తదితరులు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న గంజాయి నిందితుడి అరెస్టు

రోలుగుంట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : ఏడాదిగా పరారీలో ఉన్న గంజాయి నిందితుడ్ని ఎట్టకేలకు రోలుగుంట పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ రామకృష్ణారావు తెలిపిన వివరాలివి. గత ఏడాది జులైలో కొవ్వూరు గ్రామ శివారున 12 కేజీల గంజాయిని తరలిస్తూ ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. ఆ వెంటనే వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఇదే కేసులో ప్రధాన నిందితుడిగా అల్లూరు జిల్లా చింతపల్లి మండలం ముంతమామిడి గ్రామానికి చెందిన పాంగి సన్యాసిరావు పరారీలో ఉన్నాడన్నారు. అప్పటి నుంచి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టామన్నారు. ఎట్టకేలకు ఆదివారం ఉదయం ముంతమామిడి గ్రామంలో సదరు నిందితుడ్ని అరెస్టు చేసినట్టు చెప్పారు.

తుప్పలతో వాహనదారులకు తిప్పలు

- రహదారులకు ఇరువైపులా పెరిగిపోవడంతో ప్రమాదాల భయం



రేఖవానిపాలెం -గొల్లగుంట రహదారికి ఇరువైపులా పెరిగిన తుప్పలు



దలాయిపాలెం- వాడ చీపురుపల్లి ప్రధాన రహదారిలో...

పరవాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రహదారులకు ఇరువైపులా పలు చోట్ల పెరిగిన తుప్పలు వాహనదారులకు ఇబ్బందిగా మారాయి. ముఖ్యంగా మం డలంలోని రేఖవానిపాలెం- గొల్లగుంట, వాడచీపురుపల్లి- వెంకటాపురం, వాడచీపురుపల్లి- దలాయిపాలెం, మూలస్వయంభూవరం- సోమునాయుడుపాలెం గ్రామా లకు వెళ్లే రోడ్లలో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పలుచోట్ల చెట్ల కొమ్మలు రహదారిపైకి వాలి ఉండడంతో వాటిని తప్పించుకోవడానికి వాహనదారులు అవ స్థలు పడుతున్నారు. దీనికితోడు రహదారుల్లో గల మలుపులు మరింత ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయంలో ఇటుగా రాకపోకలు సాగించాలంటే విషపురుగుల సంచారం అధికంగా ఉండడంతో భయాందోళన చెందుతున్నామని చెపుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బావిలో పడి యువకుడి మృతి?

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీదేవిపేట శివారులో గల వ్యవసాయ బావిలో స్నానానికి దిగిన గాజువాక డ్రైవర్ కాలనీకి చెందిన యువకుడు ఆదివారం మృతి చెందినట్టు తెలిసింది. ఈ విషయమై పట్టణ సీఐ టీవీ విజయ్ కుమార్‌ను వివరణ కోరగా, తమకు ఎటువంటి ఫిర్యాదు లేదన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పాత కక్షలతో వ్యక్తిని గాయపర్చిన ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్‌పై కేసు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో ఆదివారం ఒక వ్యక్తిని రాడ్డుతో కొట్టి గాయపర్చిన ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్టు సీఐ టీవీ విజయ్ కుమార్ తెలిపారు. పాత కక్షల కారణంగా ఈరమ్మరెడ్డి భద్రరావును ఆదివారం అండర్‌బ్రిడ్జి సమీపంలో సత్యనారాయణ కొట్టి గాయపర్చినట్టు బాధితుడు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.



బీఆర్‌టీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం

కొత్తూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పిసినికాడ పంచాయతీ పరిధి బీఆర్‌టీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి గ్రామ నాయకులు ఆదివారం భూమిపూజ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.మూడు లక్షలతో చేపడుతున్న ఈ పనులను సర్పంచ్ యల్లపు రమేష్, టీడీపీ నాయకులు మళ్ల శ్రీను, యల్లపు వెంకట్రావు, పొలమరశెట్టి నూకరాజు తదితరులు ప్రారంభించారు.



బంగారమ్మపాలెంలో పనుల ప్రారంభోత్సవంలో...

బంగారమ్మపాలెంలో...

సబ్బవరం : మండ లంలోని బంగారమ్మపాలెంలో రూ.ఐదు లక్షల పంచా యతీ నిధులతో చేపట్టనున్న ప్లాట్‌ఫాం నిర్మాణ పనులను సర్పంచ్ దాడి లావణ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని రామాలయం ఎదుట, ప్రముఖ సోమలింగేశ్వర స్వామి ముఖద్వారం ఎదుట సీసీ ప్లాట్‌ఫాం ఏర్పాటుకు తీర్మానించిన మేరకు పనులకు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దాడి కన్నం నాయుడు, శివ తదితరులు పాల్గొన్నారు.



రాళ్లుతేలి అధ్వానంగా మారిన చింతలపూడి వద్ద రోడ్డు



కోతకు గురైన రహదారి



ఇరువైపులా పిచ్చిమొక్కలు

రహదారి ఛిద్రం.. ప్రయాణం నరకం

- చింతలపూడి- చోద్యం రోడ్డు దుస్థితి
- 4 కిలోమీటర్ల పొడవునా గోతులు... తుప్పలు
- పట్టించుకోని సంబంధిత శాఖాధికారులు
- 40 గ్రామాల ప్రజలకు కష్టాలు

కొయ్యూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి- చోద్యం రోడ్డుకు కనీస మరమ్మతులు లేక వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. గత 15 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ రహదారిని అప్పటినుంచి నిర్వహణ పనులు చేపట్టక శిథిలమైంది. దీనికి తోడు రహదారికి ఇరువైపులా రెండొంతుల మేర తుప్పలు ఆక్రమించాయి. ఈ రహదారిపై మండలానికి చెందిన ఐదు పంచాయతీల పరిధిలోని సుమారు 40 గ్రామాల ప్రజలకు రాకపోకలు సాగిస్తుంటారు. 2009లో అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో రహదారి నిర్మాణాలకు నిధులు కేటాయించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హయాంలో రహదారి నిర్మాణాలు పూర్తయ్యాయి. నాటి నుంచి నేటి వరకు ఈ రహదారికి కనీస మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. నాలుగు సంవత్సరాల క్రితం ఇదే రోడ్డుకు సంబంధించి చోద్యం నుంచి కంఠారం వరకు ఏడు కిలోమీటర్ల మేర రహదారి మరమ్మతులకుగానూ రూ. 2 కోట్లు మంజూరు చేస్తున్న ట్టు అప్పటి పాలకులు ప్రకటించినా నిధులు మంజూరు కాలేదు. అయితే, బొర్రంపేట నుంచి గింజర్తి మధ్యలో సుమారు 5 కిలో మీటర్లు మేర రహదారి కనీసం ద్విచక్రవాహనాలపైన వెళ్లాలన్నా నరకాన్ని తలపిస్తోంది. అప్పట్లో ఈ రహదారి నిర్మా ణాలు చేసిన కాంట్రాక్టర్ తన గ్యారంటీ కాలంలో సైతం రహదారిపై గోతులు పడినా వాటిని పూడ్చివేత చర్యలు చేపట్టలేదు. దీంతో క్రమేణా రహదారి పొడవునా గోతులు పడటమే కాకుండా ప్రధానంగా బొర్రంపేట నుంచి చింతలపూడి పంచాయతీ గింజర్తి వరకు సుమారు ఐదు కిలోమీటర్లు పూర్తిగా శిథిలమైంది. గోతులు, రాళ్ల తేలి రాకపోకలకు తీ వ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మధ్యలో ఘాట్ రోడ్డు సైతం శిథిలం కావడంతో వాహన చోదకుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇదిలా ఉంటే రహదారి పొడవునా రోడ్డుకిరువైపులా తుప్పలు రోడ్డును ఆక్రమించాయి. దీంతో ఈ రహదారి కేవలం కాలిబాట మాదిరిగా మారింది. ఈ తుప్పలను సైతం తొలగించేలా చర్యలు లేకపోవటంతో చిన్నపాటి మలుపులు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనపించక ప్రమాదా లు సంభవిస్తున్నాయి. ఐదు పంచాయతీలకు చెందిన సుమారు 40 గ్రామాల ప్రజలకు మండల కేంద్రంకు రావాలంటే నానా యాతన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి కనీసం తుప్పలు తొలగించే చర్యలు అయినా చేపట్టించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

దిష్టిబొమ్మలతో పంటకు రక్షణ

- గిరిజనుల

వినూత్న ఆలోచన



పాడేరు మండలం మినుములూరు వద్ద వరి పొలంలో దిష్టిబొమ్మ

ఎక్కడైనా రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు మనుషులను కాపలా పెట్టుకోవడం సహజం. కానీ, మన్యంలో గిరిజన రైతులు అందుకు వినూత్న ఆలోచన చేశారు. మనుషులను పోలినట్టుగా బొమ్మలను తయారు చేసి, వాటికి బట్టలు సైతం వేసి పంట పొలాల్లో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పక్షులు, పశువులు సైతం వాటి చూసి మనుషులున్నారని భ్రమించి పంటల జోలికి రావడం లేదు. పశువులు, పక్షుల నుంచి తమ పంటలను రక్షించుకునేందుకు గిరిరైతులు చేసిన ఈ వినూత్న ఆలోచన విశేషంగా ఆకట్టుకుంటున్నది. పెదబయలు, పాడేరు ప్రాంతాల్లో పలు పంటపొలాల్లోని ఆయా దిష్టి బొమ్మలకు 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి/పాడేరు

హిందీ మాధ్యమ పరీక్షలు



కించుమండలో పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కన్వీనర్ సూరిబాబు

డుంబ్రిగూడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హిందీ ప్రచార మాధ్యమ అర్హత పరీక్షలు కించుమండ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహించనున్నట్టు పాడేరు ఐటీడీఏ హిందీ బోర్డు కన్వీనర్ శెట్టి సూరిబాబు తెలిపారు. ఆదివారం ఈ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోయర్ సెక్షన్‌నుంచి హింది నాగరి బోర్డు డిగ్రీ వరకు ఈ పరీక్షలు ని ర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు రాస్తున్న 29 మంది విద్యార్థులకు ఉచిత భోజనం అం దిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. గత ఏడాది నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఇద్దరు విద్యార్థులకు హిందీ పరీక్ష దినోత్సవం పురస్కరించుకుని అర్హత సర్టిఫికెట్లు అందజేశామన్నారు.


చింతపల్లికి 20 టన్నుల యూరియా



డీలర్లకు కేటాయిస్తున్న ఏవో మధుసూదనరావు

చింతపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రైవేటు డీలర్లకు 20 టన్నుల యూరియా సరఫరా చేసినట్టు స్థానిక మండల వ్యవసాయ అధికారి టి. మధుసూదనరావు తెలిపారు. ఆదివారం మండల కేంద్రానికి వచ్చిన యూరియాను డీలర్లకు మూడు నుంచి ఐదు టన్నులు చొప్పన కేటాయించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో యూరియా, డీఏపీ అందుబాటులో ఉందన్నారు. ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం మండలంలో ఎక్కడా యూరియా కొరతలేదన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల వద్ద అవసరం మేరకు యూరియాను తీసుకోవచ్చునన్నారు.

అమలగుడలో సమస్యలపై నిరసన



నినాదాలు చేస్తున్న గిరిజనులు

అనంతగిరి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి పంచాయతీ అమలగుడ గ్రామస్థులు తమ సమస్యలను పరిష్కరించాలని ఆదివారం ఆందోళన చేపట్టారు. గ్రామానికి పూర్తిస్థాయిలో రోడ్డు సౌకర్యం లేక దీంతో అత్యవసర పరిస్థితిలో నరకం చూస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. అటవీ భూములకు పట్టాలు ఇవ్వలేదని, అ న్నదాత సుఖీభవ తదితర పథకాలు అందడంలేదని గిరిజనులు వాపోయారు. అధికారులు గ్రామాన్ని సందర్శించి సమస్యలను పరిష్కరించేదిశగా చర్యలు చేపట్టాలని, గ్రామస్థులు కొర్రా రామచందర్, రాములు, మల్లేశ్, అప్పన్న, రాందాస్, వాపోయారు.

'భాషా పండితులకు న్యాయం చేయాలి'



ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

పాడేరురూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): డీఈవో పూల్ భాషా పండితులు తమకు పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలని కోరుతూ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడుకు ఆదివారం వినతిప్రతం అందించారు. పాడేరు పర్యటనకు వచ్చిన ఆయనను అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిపల్లి సింహాచలం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాలు ఎమ్మెల్సీని కలిసి డీఈవో పూల్ భాషా పండిట్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ 2019లో పండితుల పదోన్నతుల్లో అన్యాయం జరిగిందన్నారు. 6 ఏళ్ల నుంచి క్యాడర్ లేక ప్రతీ బదిలీలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. భాషా పండితులకు న్యాయస్థానం తీర్పునకు అనుకూలంగా పాఠశాలల సహాయకులుగా పదోన్నతులు కల్పించాలన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నా యులు దేముళ్ళ నాయుడు, టి.రామస్వామి, డి.కృష్ణమూర్తి, డి.రామయ్య, భాషా పండిట్‌ల నాయకులు ఎస్.పరమేశ్, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం చొరవ

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్



పంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నేత ప్రసాద్

కొయ్యూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పంచాయతీ కార్యాలయంకు భవన సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిధులు కేటాయించినట్టు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం చింతలపూడి లో రూ. 32 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాలకు ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. గ్రామాలలో అభివృద్ధి కుంటుపడడమే కాకుండా కనీసం పారిశుధ్య పరిరక్షణ చర్యలనూ గాలికి వదిలిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీలను ప్రగతి పథం వైపు నడిపించేందుకు చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. ప్రతీ పంచాయతీకి భవన సౌకర్యం కల్పిస్తోందన్నారు. ఇందులో భాగంగా మండలంలో ఐదు పంచాయతీలను గుర్తించి రూ 1.60 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మూర్తి, పంచాయతీ అధ్యక్షుడు పుల్లయ్య, నాయకులు గడ్డయ్య, సన్యాసిరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు బాలరాజు, ఇతర నేతలు శ్రీను, సూరిబాబు, కనకరాజు, భాస్కరరావు(బాచి) తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రహదారి మరమ్మతులు



చెరువులేవేనం రహదారిలో గోతులు పూడ్చుతున్న గిరిజనులు

చింతపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులవేనం ఆదివాసీలు శ్రమదానంతో ఆదివారం రహదారి మరమ్మతులు చేసుకుంటున్నారు. మహిళలు, యువకులు గోతులను పూడ్చారు. రహదారిపై విరిగిపడిన కొండచరియలను తొలగించారు. లంబసింగికి సమీపంలో ఎత్తైన కొండపైన చెరువులవేనం గ్రామం ఉన్నది. శీతాకాలంలో ఇక్కడి మంచు అందాలను వీక్షించేందుకు భారీ సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. గ్రామంలో పర్యాటకుల కోసం వ్యూపాయింట్ నిర్మించారు. ఈ గ్రామానికి భీమనాపల్లి నుంచి మట్టి రోడ్డు నిర్మించారు. గత వైసీపీ ప్రభుత్వం తారు రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం గత జనవరిలో పీఎం జన్‌మన్ పథకంలో రూ.2.4కోట్ల నిధులను విడుదల చేసింది. నిర్మాణాలు ప్రారంభించాల్సిన పంచాయతీరాజ్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ఇ ప్పటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేయలేదు. రెండు నెలలుగా కురిసిన వర్షాలకు రహదారిపై కొండచరియలు విరిగి పడ్డాయి. వర్షపునీరు రహదారి పై నుంచి ప్రవహించడంతో పలు కోట్ల కోతకుగురైంది. భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో గ్రామానికి నాలుగు చక్రాల వాహనాలు వచ్చే పరిస్థితిలేదు. పర్యాటకులు, ఆదివాసీలు ఈ మా ర్గంపై రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. దీంతో గ్రామానికి చెందిన గిరిజనులు రెండు వారాలుగా వ్యవసాయ పనులేని సమయంలో శ్రమదానం చేస్తున్నారు. గోతులను రాళ్ళు, మట్టితో పూడ్చుతున్నారు. రహదారిపై పడిన కొండచరియలను తొలగిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామానికి రహదారి నిర్మాణాలు వేగవంతం చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ కొండలరావు

హుకుంపేట సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేరుపుట్టు పంచాయతీ పరిధి డొంకినవలస, చిలకలపుట్టు గ్రామాలకు వెళ్లే రోడ్డుపనులకు ఆదివారం వైస్ఎంపీపి కొండలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామాలకు సరైన రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నామని ఆయా గ్రామాల గిరిజనులు అధికారులకు వినతి పత్రం అందించారన్నారు. ఈనేపథ్యంలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘ నిధులు రూ. 5 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సుబ్బారావు, సురేశ్, నాగేశ్వరావు , ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత రామ్మూర్తి మృతి

పెదబయలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు లొట్టి రామ్మూర్తి (95) ఆదివారం మృతి చెందారు. కొద్ది కాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన పెదబయలు స్వగృహంలో ఆయన ఆదివారం తుది శ్వాస విడిచారు. రామ్మూర్తి టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు స్ఫూర్తితో మండల రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు. ఆ పార్టీకి విశేష సేవలందించారు. దీంతో జిల్లాలోని ముఖ్య నేతలు పెదబయలు చేరుకుని ఆయన పార్థివదేహానికి నివాళులు అర్పించారు.

కరాటేలో అక్కా, తమ్ముడికి పతకాలు



కరాటేలో బంగారు, రజత పతకాలు సాధించిన జాస్విని, లోహిత్

చింతపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న అక్క, తమ్ముడు కరాటేలో సత్తాచాటారు. ఆదివారం అమలాపురంలో కరాటే పోటీలు జరిగాయి. ఈపోటీల్లో ఎనిమిదోవ తరగతి విద్యార్థిని పాడి జాస్మిని కృష్ణ ప్రియ, ఆరోవతరగతి చదువుతున్న విద్యార్థి లోహిత్ కృష్ణ పాల్గొన్నారు. కృష్ణప్రియకు కరాటేలో బంగారు, లోహిత్ కృష్ణ రజతం పతకాలు లభించాయి. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ అభినందించారు.

గిరిజనుడికి పాముకాటు



డుంబ్రిగూడ పీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్న బాలరాజు

డుంబ్రిగూడ, సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కించుమండ గ్రామానికి చెందిన సాకెరి బాలరాజు ఆదివారం పాము కాటుకి గురయ్యారు. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలో పొలానికి వెళ్లే తుప్పలలో ఉన్న సర్పం బాలరాజును కాటు వేసింది. కుటుంబసభ్యులు అతనిని హుటాహుటీన డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి విష సర్పం కాటుగా గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నారు.

మహిళా సాధికారత సదస్సులో అరకులోయ ఎంపీ



తిరుపతిలో జరిగిన జాతీయ సదస్సుకు హాజరైన ఎంపీ తనూజరాణి (మధ్యలో)

పాడేరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): 'వికసిత్ భారత్‌కు మహిళా నాయకత్వం' నినాదంతో ఆదివారం తిరుపతిలో నిర్వహించిన జాతీయ మహిళా సాధికారత సదస్సులో జిల్లా నుంచి అరకులోయ ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి పాల్గొన్నారు. ఈ సదస్సులో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ముఖ్యఅతిథిగా హాజరు కాగా వివిధ ప్రాంతాలకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

పాడేరురూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ ప్రాంతాల భక్తులతోపాటు మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి ఆలయంలో రద్దీ నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి ఘటాలను సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలను చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. వందలాది మంది భక్తులు ఆలయ ప్రాంగణంలో అమ్మవారి పండగను ఆనందంగా జరుపుకున్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భవాని మాలధారులు, భక్తులకు ఉదయం ప్రసాదం, మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అం దించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బి.వెంకటరమణ, సీహెచ్.రామకృష్ణ, దన్నేటిపలాసి రాము, జి.శంకరరావు, టి.ఈశ్వరరావు, కె.వెంకటరమణ, కె.చంద్రమోహన్‌కుమార్, కె.దేముడు, కె.రాధాకృష్ణం నాయుడు, లకే రత్నాబాయి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో జోష్

... 5వ పేజీ తరువాయి

అభివృద్ధి కోసం తెచ్చిన పరిశ్రమలు, ప్రాజెక్టుల గురించి వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధానిమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నదని, ఇందుకు అవసరమైన నిధులను ఇస్తున్నదని చెప్పారు. భవిష్యత్తులో మరింత చేయూత అందిస్తామని స్పష్టం చేశారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోయేందుకు మోదీ ఇతోధికంగా సాయపడుతున్నారన్నారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం

డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వివరించారు. స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకునేందుకు గతంలో వాజపేయి, ఇప్పుడు మోదీ సర్కారు అందించిన సహాయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. సుమారు రూ.11,500 కోట్ల గ్రాంట్‌ను ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంటుకు అందించి ఆదుకునేందుకు యత్నిస్తున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలంతా కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత బీజేపీ తీసుకుందన్నారు. అగ్ర నాయకుల ప్రసంగాలకు పార్టీ శ్రేణుల నుంచి మంచి స్పందన వచ్చింది. అంతకుముందు పార్టీ నాయకులకు శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఓపెన్ టాప్ వాహనంపై నడ్డా, మాధవ్ తదితర నేతలు ర్యాలీగా వేదిక వద్దకు చేరుకున్నారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను సందర్శించారు. అరకు కాఫీ, ఏటికొప్పాక బొమ్మలు, కొబ్బరిపీచుతో తయారుచేసిన వస్తువులు, పొందూరు ఖాదీ ఉత్పత్తులను పరిశీలించారు. నడ్డాతో పాటు ఇతర ప్రముఖులకు జీసీసీ అధికారులు బహుమతులను అందించారు. అనంతరం వేదికపైకి చేరుకున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, జాతీయ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్‌కు రాష్ట్ర నేతలు స్వాగతం పలికారు. పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు ఆధ్వర్యంలో జేపీ నడ్డా, మాధవ్‌లను గజమాలతో సత్కరించారు.అంతకుముందు సభా ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, విష్ణుకుమార్ రాజు, కామినేని శ్రీనివాస్, నడుకుదిటి ఈశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

భారీగా హాజరైన శ్రేణులు..

సభకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే సభా ప్రాంగణానికి రావడం మొదలుపెట్టారు. 11 గంటలకు ముఖ్య నాయకులు వేదికపైకి వచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభ సాగింది. వర్షం వచ్చినా ఆటంకం లేకుండా భారీ రెయిన్ ప్రూఫ్ టెంట్లు వేశారు.

గంగవరంలో గ్రావెల్ తవ్వకాలు

... 5వ పేజీ తరువాయి

కంట పడకుండా అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు తెల్లవారుజాము వరకు తవ్వకాలు జరుపుతున్నారు. ఈ సమయంలో ఇటుగా ఎవరైనా వస్తుంటే సమాచారం ఇవ్వడానికిచుట్టుపక్కల మార్గాల్లో 10 నుంచి 15 మందిని కాపలా పెట్టారు. ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలను ఆనుకొని తవ్వుకు పోతున్న మట్టి, గ్రావెల్‌ను గంగవరం, వెదుళ్లనరవ, గాజువాక మండలం దువ్వాడ, సంధ్యానగర్ కాలనీ, చుట్టుపక్కల ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వివిధ పనుల నిమిత్తం గ్రావెల్, మట్టి అవసరమైన వారికి డంపింగ్ యార్డుల నుంచి పట్టపగలు దర్జాగా తరలిసున్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలను ఆనుకొని గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారికి రెవెన్యూ, మైనింగ్ శాఖలకు చెందిన కిందిస్థాయి సిబ్బంది సహకరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ తవ్వకాల గురించి అధికారులకు సమాచారం ఇస్తే.. వారు ఈ విషయాన్ని కిందిస్థాయి సిబ్బందికి చెప్పి, సంఘటన స్థలానికి వెళ్లాలని ఆదేశిస్తున్నారని, అయితే గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోకుండా, సమాచారం ఇచ్చిన వారి వివరాలను అక్రమార్కులకు చేరవేస్తున్నారని, దీంతో వారు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆవేన వ్యక్తం చేస్తున్నారు. అందుకే కొంతకాలం నుంచి ఫిర్యాదులు చేయడం, సమాచారం ఇవ్వడం ఆపేశామని చెబుతున్నారు. గంగవరం ఆనుకొని ఉన్న నంగినారపాడు రెవెన్యూ పరిధిలో కూడా ఎర్రమట్టిని తవ్వి తరలించుకుపోతున్నారని చెబుతున్నారు.

నాడు అలా.. నేడు. ఇలా!

... 5వ పేజీ తరువాయి

చెప్పారు. అయితే పంట కాలువలో చెత్తాచెదారం తొలగించే పనిని తాము చేపడతామని మునిసిపల్ అధికారులు చెప్పడంతో ఇరిగేషన్ అధికారులు అంగీకరించారు. అయితే అనకాపల్లి మునిసిపాలిటీ జీవీఎంసీలో విలీనం అయిన తరువాత యల్లయ్య కాలువ నిర్వహణను సరిగా పట్టించుకోలేదు. కాలువకు ఇరుపక్కలా నివాసాలు పెరిగిపోవడంతో చెత్తాచెదారం సమస్య అధికమైంది. కాలువలో నీరు ప్రవహించకపోవడంతో పొలాలకు సకాలంలో నీరు అందేది కాదు. వర్షాధారంగా రైతులు పంటలు పండించుకోవాల్సి వచ్చేది. వైసీపీ అధికారంలో వున్న ఐదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా కాలువలో పూర్తిస్థాయిలో పూడికలు తీయించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత యల్లయ్య కాలువ సమస్యను ఆయకట్టు రైతులు, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. అయితే అప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో గత ఏడాది కాలువలో పనులు చేపట్టడానికి వీలు కాలేదు. ఈ ఏడాది వేసవిలో నియోజకవర్గంలోని పంట కాలువల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. సుమారు రెండు కోట్ల రూపాయలతో సాగునీటి సంఘాల పర్యవేక్షణలో పనులు చేయించారు. దీనిలో భాగంగా జీవీఎంసీ ద్వారా రూ.50 లక్షలతో యల్లయ్య కాలువలో పూడికలు తీయించడంతోపాటు గ్రోయిన్‌కు సమీపంలో కాలువను అభివృద్ధి పరిచారు. దీంతో ఆయకట్టుకు సాఫీగా నీరు చేరుతున్నదని, సకాలంలో వరినాట్లు వేసుకున్నామని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు డీఎస్సీ ఎంపిక జాబితా

... 5వ పేజీ తరువాయి

అర్హులైన అభ్యర్థులు లభించలేదు. దీంతో ఐదు పోస్టులను పెండింగ్‌లో ఉంచారు. మిగిలిన పోస్టుల్లో కేటగిరీల వారీగా జడ్పీ, మునిసిపల్, ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో ఎస్జీటీలు 239, స్కూల్ అసిస్టెంట్, తత్సమాన వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు 495, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఎస్జీటీలు 335, స్కూల్ అసిస్టెంట్ 65 పోస్టులకు మెరిట్ జాబితా మేరకు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేశారు. మొత్తం 1,134 మంది అభ్యర్థుల వివరాలతో కూడిన జాబితాపై అభ్యంతరాలు తెలుసుకునేందుకు వీలుగా రెండు రోజుల కిందటే జాబితాను జిల్లాకు పంపారు. జాబితాను పరిశీలించిన విద్యాశాఖ తిరిగి పాఠశాల విద్యాశాఖకు పంపింది.

19న నియామక పత్రాలు

డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 19వ తేదీన రాజధాని అమరావతిలో నియామకపత్రాలు అందజేస్తారు. 22వ తేదీ నుంచి వారందరికీ జిల్లాలో రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం 80 మంది టీచర్లను రిసోర్స్ పర్సన్లుగా ఎంపికచేశారు. ఎస్జీటీలు, సబ్జెక్టు వారీగా స్కూల్ అసిస్టెంట్లకు వేర్వేరుగా శిక్షణ అందిస్తారు. అయితే మొత్తం 1,134 మందికి ఒకేచోట శిక్షణ ఇచ్చేందుకు అనువుగా ఉండే వేదికను ఎంపిక చేసేందుకు విద్యా శాఖ కసరత్తు చేస్తున్నది. దీంతో పాటు సబ్జెక్టు టీచర్లకు మూడు జిల్లాల్లో వేర్వేరుగా శిక్షణ ఇచ్చే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తున్నామని విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

ఊరి మధ్యలో డంపింగ్ యార్డు!

... 5వ పేజీ తరువాయి

సర్వే నంబరు 65/11లో 70 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు 2023 ఆగస్టులో కేటాయించారు. అప్పటి నుంచి గ్రామంలో సేకరించిన చెత్తను ఇక్కడ పడేసేవారు. ఆరు నెలలు తిరక్కుండానే ఓ వ్యక్తి ఈ స్థలం తనదంటూ కోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చారు. దీంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. యథావిధిగా మీసేవ కేంద్రం- తహశీల్దారు కార్యాయానికి మధ్యలో వున్న ఖాళీ స్థలంలో, బీసీ విద్యార్థుల హాస్టల్‌ను ఆనుకొని చెత్తను పడేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో చెత్తాచెదారం కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నది. దీనికితోడు పందుల ఆవాసంగా మారిపోయింది. పగలు ఈగలు, రాత్రి దోమల బెడద పెరిగిపోయింది. చెత్త సమస్యపై పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాలతో ఇక్కడ చెత్తను లారీలతో విశాఖపట్నం కాపులుప్పాడలోని జిందాల్ విద్యుత్ కేంద్రానికి తరలింపు చర్యలు చేపట్టామని. అయితే ఒక్కో ట్రిప్పునకు (సుమారు పది టన్నులు) రూ.12 వేలు కిరాయి చెల్లించాల్సి వస్తున్నదని చెప్పారు. రోజూ ఒక లారీ చెత్త వస్తుందని, అంత ఖర్చును భరించే స్థోమత పంచాయతీకి లేకపోవడంతో కాపులుప్పాడకు చెత్తను తరలించడం లేదని చెప్పారు. డప్పింగ్ యార్డుకు రెవెన్యూ శాఖ కేటాయించిన స్థలంపై న్యాయ వివాదం కొలిక్కి వచ్చే వరకు చెత్త సమస్యకు మోక్షం లేదని నిస్సహాయతను వ్యక్తం చేశారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

తయారైంది. దీనిని అభివృద్ధి చేయడానికి నాబార్డు నిధులు రూ.1.45 కోట్లు మంజూరయ్యాయి. అదే విధంగా ఎల్‌వీకే రోడ్డు నుంచి జి.సన్యాసిరాజుపాలెం మీదుగా నీలిగుంట వరకు రహదారి మొత్తం పాడైపోయింది. సుమారు ఐదు కిలోమీటర్లు వున్న ఈ రోడ్డు అభివృద్ధికి నాబార్డు నిధులు రూ.1.35 కోట్లు మంజూరయ్యాయి. ఈ రెండు పనులకు టెండర్ల ప్రక్రియ ముగిసి, అగ్రిమెంట్ కూడా పూర్తయ్యిందని, కొద్ది రోజుల్లోనే పనులు ప్రారంభం అవుతాయని పీఆర్ (ప్రాజెక్ట్స్) డీఈఈ రాజ్‌కుమార్ తెలిపారు.

పేద కుటుంబంపై విధి కన్నెర్ర

- దెబ్బ మీద దెబ్బ తగలడంతో మంచం పట్టిన కుటుంబ సభ్యులు
- భారంగా మారిన కుటుంబ నిర్వహణ
- చావు బతుకుల్లో కుటుంబం


దీన స్థితిలో ఉన్న పేద కుటుంబం

మాకవరపాలెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆ పేద కుటుంబంపై విధి కన్నెర్ర చేసింది. ఒక దాని తర్వాత మరో దెబ్బ తగిలి సంపాదించే వారంతా మంచం పట్టడంతో కుటుంబ నిర్వహణకు డబ్బులు లేక ఆ కుటుంబం చావుబతుకుల మధ్య రోజులు లెక్కపెడుతోంది. ఆపన్నహస్తం కోసం ఆ కుటుంబం ఎదురుచూస్తోంది.

మండలంలో రాచపల్లి గ్రామానికి చెందిన బేతా అప్పారావు, భార్య పార్వతి, కుమారుడు ఏసు జీవనం సాగిస్తున్నారు. సాఫీ సాగుతున్న ఈ కుటుంబంపై విధి పగబట్టింది. రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమారుడు బేతా ఏసు కాలు పూర్తిగా కోల్పోయాడు. అనంతరం అన్‌రాక్ కంపెనీలో పనిచేస్తున్న తండ్రి అప్పారావు పక్షవాతానికి గురయ్యాడు. వీరి బాధ చూడలేక భార్య పార్వతి మంచం పట్టింది. అనంతరం ఆమెకు లీవర్ సమస్య ఉందని డాక్టర్లు చెప్పడంతో బాగు చేయించుకోవడానికి డబ్బులు లేక ఏడాది నుంచి మంచం మీదే పడి ఉంది. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం అధికారపార్టీ నాయకులకు తెలిపారు. వారు పట్టించుకోలేదు. దీనికితోడు కుమారుడికి కాలు లేకపోయినప్పటికి పింఛన్ రూ.15వేలు రావల్సి ఉండగా.. అతనికి రూ.ఆరు వేలు మాత్రమే వస్తున్నది. ఈ పింఛన్ డబ్బులతో వీరి కుటుంబం జీవనం సాగిస్తూ అష్టకష్టాలు పడుతున్నారు. ముగ్గురుని సమస్యలు వేధిస్తుండడంతో ఆ కుటుంబం వైపు చూసి బాధ పడుతున్నారే తప్ప సాయం చేసే చేతులు ముందుకు రావడం లేదు. కనీసం ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేస్తే వైద్యం చేసుకొని తన తల్లిని బతికించుకుంటామని దివ్యాంగ కుమారుడు ఏసు వేడుకుంటున్నారు. ఎవరైనా తమ కుటుంబాన్ని ఆదుకుంటారనే ఆశతో ఆ కుటుంబ సభ్యులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చెత్తతో నిండిన డంపర్ బిన్లు

తొలగించని పారిశుధ్య సిబ్బంది.. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న స్థానికులు


పోలీస్ స్టేషన్ వద్ద డంపర్ బిన్ నిండిపోయి చెత్త చెల్లాచెదురుగా పడిన దృశ్యం

నర్సీపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చెత్తతో డంపర్ బిన్లు కంపుకొడుతున్నాయి. పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న డంపర్ బిన్ నిండి పోయి చెత్త చెల్లా చెదురుగా పడి కుక్కలు, పందులు అధ్వానంగా చేస్తున్నాయి. అదే విధంగా పాత మునిసిపాల్ కార్యాలయం ఎదురుగా ఉన్న డంపర్ బిన్ కూడా నిండిపోయింది. డంపర్ బిన్లు నిండిపోతే కంపాక్టర్ సహాయంతో చెత్తను తొలగించాలి. కానీ శానిటేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు గళమెత్తుతున్నారు. వర్షానికి చెత్త తడిచిపోయి కుళ్లి దుర్వాసన వెదజల్లుతుంది. వెంటనే చెత్తను తొలగించాలని కోరారు. దీని మీద శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబుని వివరణ కోరగా.. సోమవారం ఉదయం డంపర్‌బిన్లలోని చెత్తను తొలగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

- ఎస్ఐ తారకేశ్వరరావు



నాతవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్టు నాతవరం ఎస్ఐ తారకేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన బాధ్యతలు చేపట్టిన అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రజల సహకారంతో నేరాల అదుపునకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎస్ఐని స్థానిక నాయకులు కరక అప్పలరాజు, చెక్కా జోగిరాజు అభినందనలు తెలిపారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన సినీహీరో సుమన్


మృతుడు నాగసాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సుమన్

గొలుగొండ/కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ ఎంపీటీసీ మాజీ సభ్యుడు గండి ఈశ్వరరావు కుమారుడు నాగసాయిబాలాజీ(22) ఇటీవల అనకాపల్లి వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. ఈ విషయం తెలిసిన ప్రముఖ సినీహీరో సుమన్ ఆదివారం రాత్రి గొలుగొండ గ్రామానికి వచ్చి నాగసాయిబాలాజీ కుటుంబాన్ని పరామర్శించారు. హైదరాబాద్‌లో నాగసాయిబాలాజీతో సుమన్‌కు పరిచయం ఉండడంతో కుటుంబ సభ్యులకు సంతాపం తెలపడానికి వచ్చారు. ఈ సందర్భంగా రోడ్డుప్రమాదంపై ఆరా తీసి కుటుంబ సభ్యులను సుమన్ ఓదార్చారు. సినీహీరో సుమన్‌ను చూసేందుకు పలువురు అభిమానులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

స్మార్టు రేషన్ కార్డుల పంపిణీ

నాతవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళ పక్షపాతి అని నాతవరం సొసైటీ చైర్‌పర్సన్ అపిరెడ్డి మాణిక్యం అన్నారు. ఆదివారం నాతవరంలో మహిళలకు స్మార్టు రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, మూడు గ్యాస్ సిలెండర్లు పంపిణీ చేసిందన్నారు. త్వరలో మహిళలకు ఆడబిడ్డ నిధి ఇవ్వనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పైల సూరిబాబు, ఇటంశెట్టి సీతారామ్మూర్తి, జీరెడ్డి రాజుబాబు, శెట్టి నానాజీ చింతకాయల శ్రీనివాసు, డీలర్లు త్రిమూర్తులు సతీష్, వీఆర్‌ఓ బాబు యర్రా కాశీ, ఐటీడీపీ కన్వీనర్ శెట్టి గోపీ శెట్టి లోవ, తదితరులు పాల్గొన్నారు.

కూలడానికి సిద్ధంగా విద్యుత్ స్తంభం

- ఒరిగిపోవడంతో భయపడుతున్న ప్రజలు

నర్సీపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో పాత విద్యుత్ స్తంభాలు మార్చకపోవడంతో సమస్యలు ఎదుర్కోవల్సి వస్తున్నది. పాత స్తంభాలన్నీ ఎత్తు తక్కువగా ఉండి విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతూ ఉంటాయి. చాలా చోట్ల స్తంభాలు ఒరిగిపోయి ఉన్నాయి. పట్టణంలో ఇటువంటి స్తంభాలు 120కి పైగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. పాత స్తంభాలు మార్చి కొత్తగా పెద్ద స్తంభాలు వేయడానికి రూ.18 లక్షలతో ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపారు. ఇంకా నిధులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సీఎంఆర్ ఎదురుగా శ్రీకర్ ల్యాబ్ రోడ్డులో విద్యుత్ స్తంభం పూర్తిగా ఒరిగిపోయింది. ఈదురు గాలులు వీస్తే పడిపోతుందని స్థానికులు భయపడుతున్నారు. విద్యుత్ సర్వీసు వైర్లు కిందకు వేలాడుతున్నాయి. చాలా కాలంగా విద్యుత్ స్తంభం మార్చమని అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని ఒరిగిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్తది వేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఏపీఈపీడీసీఎల్ ఏఈ మనోజ్ కుమార్‌ని వివరణ కోరగా.. త్వరలో కొత్త స్తంభాలకు నిధులు మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.


సీఎంఆర్ ఎదురు రోడ్డులో ఒరిగిన విద్యుత్ స్తంభం

యువకుడిని రక్షించిన మెరైన్ పోలీసులు


రేవుపోలవరంలో రక్షించిన కర్రి సాయితో మెరైన్ పోలీసులు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవుపోలవరం సముద్ర తీరంలో కొట్టుకుపోతున్న యువకుడిని ఆదివారం మెరైన్ పోలీసులు రక్షించారు. ఇందుకు సంబంధించి మెరైన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. చోడవరం మండలం గౌరీపట్నం గ్రామానికి చెందిన కర్రి శివ మండలంలోని పెదగుమ్ములూరులోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. అక్కడ నుంచి మరో ఇద్దరితో కలిసి రేవుపోలవరం సముద్రతీరానికి వెళ్లాడు. ముగ్గురు సముద్రతీరంలో స్నానాలు చేస్తుండగా శివ సముద్రంలో కొట్టుకుపోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న పెంటకోట మెరైన్ ఎస్ఐలు దొర, కృష్ణ, కానిస్టేబుల్ చిన్నబాబు, సిబ్బంది శివ, శ్రీను, అప్పలరాజులు ఆ యువకుడి రక్షించి ఒడ్డుకు చేర్చారు. యువకుడిని కాపాడిన మెరైన్ పోలీసులను పర్యాటకులు అభినందించారు.

'వడ్డాదిలో యూరియా కొరత లేదు'

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి) : వడ్డాది గ్రామంలో యూరియా కొరత లేదని, దీనిపై వైసీపీ నాయకులు కావాలనే రాద్ధాం తం చేస్తున్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు దొండా నరేష్ అన్నారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఏడాదికి 24 టన్నుల యూరియా సరఫరా చేసేవారని, కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు 36 టన్నులు సరఫరా చేసినట్టు చెప్పారు. మరో 24 టన్నుల యూరియా సోమవారం నుంచి అధికారులు పంపిణీ చేయనున్నారని వెల్లడించారు. వైసీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మవద్దన్నారు. విజయరామరాజుపేటలో భూములు సాగు చేసే రైతులకు వడ్డాదిలో అందించే ఏర్పాటు చేశామన్నారు. రైతులకు కావలసినంత యూరియా అధికారుల వద్ద సిద్ధంగా ఉందని వివరించారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న గంజాయి నిందితుడి అరెస్టు

రోలుగుంట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : ఏడాదిగా పరారీలో ఉన్న గంజాయి నిందితుడ్ని ఎట్టకేలకు రోలుగుంట పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ రామకృష్ణారావు తెలిపిన వివరాలివి. గత ఏడాది జులైలో కొవ్వూరు గ్రామ శివారున 12 కేజీల గంజాయిని తరలిస్తూ ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. ఆ వెంటనే వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఇదే కేసులో ప్రధాన నిందితుడిగా అల్లూరు జిల్లా చింతపల్లి మండలం ముంతమామిడి గ్రామానికి చెందిన పాంగి సన్యాసిరావు పరారీలో ఉన్నాడన్నారు. అప్పటి నుంచి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టామన్నారు. ఎట్టకేలకు ఆదివారం ఉదయం ముంతమామిడి గ్రామంలో సదరు నిందితుడ్ని అరెస్టు చేసినట్టు చెప్పారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ప్రతినిధులు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజును కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయనను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు దుర్గాప్రసాద్, మహాలక్ష్మినాయుడు మాట్లాడుతు ఎన్నికల ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.దేముడుబాబు, ఆర్.చిరంజీవి, మల్లేశ్వరరావు, గొల్లు శ్రీనివాసరావు, సత్యనారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు కలర్ బెల్ట్ పోటీలు

చోడవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఆదివారం ఉమ్మడి జిల్లా తైక్వాండో క్రీడాకారులకు కలర్ బెల్ట్ పోటీలు నిర్వహించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పల్లం మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటైన పోటీల్లో రెడ్, బ్లాక్, గ్రీన్, గ్రీన్‌వన్, బ్లూ బెల్టులకు అర్హత సాధించిన క్రీడాకారులను కోచ్‌లతో పాటు తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.హర్షవర్ధన్ ప్రసాద్ అభినందించారు.

'కోళ్ల వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో వేస్తే చర్యలు'

దేవరాపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కోళ్ల వ్యర్థాలను, చనిపోయిన కోళ్లను బహిరంగ ప్రదేశాల్లో వేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని కె.కోటపాడు పశు సంవర్థక శాఖ ప్రాంతీయ సహాయ సంచాలకుడు ఈ.దినేష్‌కుమార్ హెచ్చరించారు. చేనులపాలెం వద్ద రైవాడ జలాశయం సాగునీటి కాలువలో చనిపోయిన కోళ్లను వేశారంటూ పత్రికల్లో ప్రచురితం కావడంతో ఆదివారం పశు వైద్యాధికారిణి డాక్టర్ జి.గాయత్రీదేవి, మంజుషారాణి, సిబ్బందితో కలిసి సదరు ప్రదేశానికి వెళ్లారు. పంచాయతీ కార్యదర్శి స్వామినాయుడు, రెవెన్యూ కార్యదర్శి రాజేంద్రకుమార్‌లతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం ఎక్స్‌కవేటర్ సాయంతో గొయ్యిని తీసి అక్కడి కోళ్లను పూడ్చివేశారు. చనిపోయిన కోళ్లను కాలువలో వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోటిపల్లినాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్ పోటీల్లో కాశీపురం విద్యార్థుల ప్రతిభ

దేవరాపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సర్వ శిక్షణ అభియాన్ భీమునిపట్నం ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, తృతీయ బహుమతులు సాధించారు. ఈనెల 11, 12 తేదీల్లో జరిగిన పోటీల్లో మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్, కథా కథన పోటీల్లో ప్రథమ, సామూహిక నృత్యం, లఘు నాటికలో తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. దీంతో అక్టోబరులో అమరావతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా వీరిని హెచ్‌ఎం ఆర్.సుజాత, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

చంద్రబాబు, పవన్‌లే స్ఫూర్తి కావాలి

- వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో కూటమి శ్రేణులకు జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు పిలుపు
- కష్టపడే వారికి పార్టీలో అన్యాయం జరగదని హామీ
- నామినేటెడ్ పదవుల్లో సైతం కీలకమైన పోస్టులు లభిస్తున్నాయని ఆనందం


చైర్‌పర్సన్ అల్లం మాధవిని సత్కరిస్తున్న నేతలు


సభలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్యే రాజు, తాతయ్యబాబు, పీవీఎస్ఎన్ రాజు

చోడవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ నాయకులు సమష్టిగా పనిచేస్తూ రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారో చూసి, జిల్లాలో జనసేన శ్రేణులు కూటమి పార్టీల నేతలను కలుపుకుంటూ ముందుకు సాగా లని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. ఇక్కడి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు ఆవరణలో జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన చైర్మన్ అల్లం మాధవి ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కూటమి పాలనలో జనసేన నాయకులు, కార్యకర్తలకు ఎటువంటి అన్యాయం జరగదని, నామినేటెడ్ పదవుల్లో సైతం జనసేనకు కీలకమైన పోస్టులు లభిస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. జిల్లాలో టీడీపీ నేతలంతా జనసేన నాయకులతో కలిసికట్టుగా ముందుకు వెళుతున్నామని, అదే స్ఫూర్తితో గ్రామస్థాయిలో కూడా జనసైనికులు టీడీపీ, బీజేపీ నాయకులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని, అన్యాయం జరగనివ్వమని ఆయన భరోసా ఇచ్చారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ వైసీపీ హయాంలో జగన్ నిరంకుశ పాలనను అడ్డుకునేందుకు రాష్ట్ర స్థాయిలో పొత్తు కుదిరిన వెంటనే, క్షేత్ర స్థాయిలో కూడా కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేయడం వల్ల ఘన విజయాలు సాధించగలిగామన్నారు. అంతా కలిసికట్టుగా పనిచేద్దామని సూచించారు. జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ చోడవరంలో కూటమి విజయానికి జనసైనికుల కృషి ఎంతో ఉందన్నారు. గత వైసీపీ హయంలో ఆ పార్టీ అన్యాయాలను గట్టిగా వ్యతిరేకించి ఆందోళనలకు దిగిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం చైర్మన్ అల్లం మాధవి, వైస్ చైర్మన్ గొర్లె సాంబశివ, ఇతర డైరెక్టర్లతో మార్కెటింగ్ శాఖ ఏడీ అశోక్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, జనసేన నాయకులు అల్లం రామప్పారావు, సిరిపురపు రమేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎస్.బంగార్రాజు, సూపర్‌వైజర్ రాంబాబు, నాలుగు మండలాల జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణంలో జనసేన కార్యకర్తలు ర్యాలీగా మార్కెటింగ్ శాఖ కార్యాలయానికి చేరుకున్నారు.

పేకాట ఆడుతూ పట్టుబడిన 10 మందిపై కేసు

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని కరక శివారు ప్రాంతంలో శనివారం రాత్రి పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పది మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 30,170 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శివాసరావు తెలిపారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీలు

- దిబ్బపాలెంలో ఘనంగా ముగిసిన వినాయక చవితి వేడుకలు

చీడికాడ సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిబ్బపాలెంలో వినాయక విగ్రహ నిమజ్జనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. తొలుత తెలుగుదేశం పార్టీ, మరిడిమాంబ యూత్ ఆధ్వర్యంలో మహిళలు ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. విజేతలకు ఎంపీటీసీ దారపు పెద్దినాయుడు, నీటి సంఘం అధ్యక్షుడు దారపు మండేలు బహుమతులు అందజేశారు. అనంతరం క్విజ్, జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పరుగు పందెం నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనను మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఆదిగణపతి కల్యాణం

చోడవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సద్భావన ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 63 అడుగుల భారీ ఆదిగణపతి విగ్రహం వద్ద ఆదివారం గణపతి కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో దంతులు పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో సద్భావన ట్రస్టు వ్యవస్థాపకులు రాజేష్ కొప్పాక తో పాటు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా పసలమ్మతల్లి పండుగ

కె.కోటపాడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పసలమ్మతల్లి పండుగను ఘనంగా నిర్వహించారు. కె.కోటపాడు, కింతాడ, గుల్లేపల్లి, చంద్రయ్యపేట, గొండుపాలెం, వి.సంతపాలెం, ఉగ్గినవలస తదితర గ్రామాల్లో పశువులకు దేవత అయిన పసలమ్మతల్లిని కొలుసుకున్నారు. ఆయా గ్రామాల్లోని పశువులన్నింటినీ పసలమ్మ దేవాలయం సమీపానికి తరలించి ఉంచారు. అనంతరం రైతులంతా సాంప్రదాయబద్ధంగా ఈ వేడుక జరిపారు.

గంజాయి రవాణా చేసే నడకదారుల గుర్తింపు

రావికమతం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చీమలపాడు, కల్యాణపులోవ పరిసరాల్లో గంజాయి రవాణాకు ఉపయోగించే నడక దారులను కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు, ఎస్ఐ ఎం.శ్రీనివాస్ ఆదివారం డ్రోన్ కెమెరాతో చిత్రీకరించారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి కల్యాణపులోవ పరిసరాల ద్వారాగంజాయిని వ్యాపారులు రవాణాకు నడకదారులు ఉపయోగిస్తున్నారన్న సమాచారం మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఈ చర్యలు చేపట్టినట్టు సీఐ చెప్పారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎప్పటికప్పుడు ఈ దారుల్లో అనుమానితుల రాకపోలను గుర్తిస్తామని వివరించారు.